తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | గురువారం - 05 - మార్చి - 2026 | సంపుటి : 3 | సంచిక : 276 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# ఐపీఎస్ కేటాయింపు పెంపుపై అమిత్ షాను కలిసిన సీఎం రేవంత్

**రాష్ట్రానికి ప్రస్తుత 83 మంది ఐపీఎస్‌లను 103కి పెంచాలని అభ్యర్థన**

2021లో జరగాల్సిన క్యాడర్ రివ్యూ ఆలస్యంగా 2025లో నిర్వహణపై ఆవేదన

సైబర్ నేరాలు, డ్రగ్స్, వైట్ కాలర్ క్రైమ్‌లను ఎదుర్కొనేందుకు బలమైన పోలీసింగ్ అవసరమని స్పష్టం

2026లోనే మూడో క్యాడర్ రివ్యూను నిర్వహించాలని కేంద్రానికి విజ్ఞప్తి

గత రెండేళ్లలో 591 మంది మావోయిస్టుల లొంగుబాటు – పునరావాస చర్యల వివరాలు కేంద్రానికి వివరణ

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర నిధులు కేటాయించాలని అభ్యర్థన

**హైదరాబాద్, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు)**

తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా ఐపీఎస్ అధికారుల సంఖ్యను కేటాయించాలని కేంద్ర హోం శాఖ మంత్రి శ్రీ అమిత్ షా గారికి ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి గారు కేంద్ర హోం శాఖ మంత్రి గారితో భేటీ అయ్యారు. రాష్ట్ర విభజన అనంతరం 2016లో మొదటి క్యాడర్ రివ్యూ జరిగిందని, 2021లో జరగాల్సిన క్యాడర్ రివ్యూ చాలా ఆలస్యంగా 2025లో జరిగిందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు గుర్తుచేశారు. ఆ సమయంలోనూ కేవలం ఏడుగురు ఐపీఎస్ అధికారులను మాత్రమే తెలంగాణకు కేటాయించారని తెలిపారు.

మిగతా 2లో..

# ములుగు సాగునీటి ప్రాజెక్టులపై మంత్రుల సమీక్ష

- ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్ష
- పనులు వేగవంతం చేయాలని ఆదేశం
- రైతులకు త్వరితగతిన నీరు అందించాలన్న లక్ష్యం




**హైదరాబాద్, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు):**

ములుగు జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై రాష్ట్ర సచివాలయంలో మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. జిల్లాలో కొనసాగుతున్న ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతి, నిధుల వినియోగం, ఎదురవుతున్న సమస్యలపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు మంత్రులకు వివరాలు అందించారు.

మిగతా 2లో..

# అధికారుల బదిలీలతో పాలన దెబ్బతింటోంది

## హరీశ్ రావు



- రేవంత్ ప్రభుత్వానికి పాలన చేయడం రావడం లేదని విమర్శ
- తరచూ బదిలీలతో శాఖలు అతలాకుతలమయ్యాయని ఆరోపణ
- ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు చేస్తున్నామని వ్యాఖ్య

**హైదరాబాద్, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణలో అధికారుల తరచూ బదిలీల వల్ల పాలన దెబ్బతింటోందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో నిర్వహించిన చిట్ చాట్ లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికు పాలన చేయడం రాకపోవడంతోనే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తరచూ బదిలీ చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఐదుసార్లు భారీ స్థాయిలో అధికారుల మార్పులు జరిగాయని హరీశ్ రావు తెలిపారు.

మిగతా 2లో..

# తెలంగాణ కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు



- అభ్యర్థులుగా వేం నరేందర్‌రెడ్డి, అభిషేక్ మను సింఘ్వి ఖరారు
- గురువారం నామినేషన్లు దాఖలు చేయనున్న అభ్యర్థులు

**హైదరాబాద్, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు ఖరారయ్యారు. వేం నరేందర్‌రెడ్డి, అభిషేక్ మను సింఘ్వి పేర్లను అధిష్ఠానం ఖరారు చేసింది. గురువారం వీరు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎంపీ వీహెచ్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, వినయ్‌కుమార్, జెట్టి కుసుమకుమార్ తదితరుల పేర్లూ వినిపించినప్పటికీ.. సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పేరు ఖరారైంది.

మిగతా 2లో..



# బంజారాహిల్స్‌లో కల్తీ నెయ్యి తయారీ కేంద్రంపై దాడి

**530 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం.. తయారీ పరికరాలు, యంత్రాలు సీజ్**

## రూ.18 లక్షల విలువైన సామగ్రి పట్టివేత

**హైదరాబాద్, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న కల్తీ నెయ్యి తయారీ కేంద్రాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. భోలానగర్‌లో నిర్వహించిన దాడిలో భారీగా కల్తీ నెయ్యిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల తనిఖీల్లో సుమారు 530 కిలోల కల్తీ నెయ్యి నిల్వ ఉంచినట్లు గుర్తించారు. అదనంగా నెయ్యి తయారీకి ఉపయోగిస్తున్న బాయిలర్లు, ప్యాకింగ్ యంత్రాలు మరియు ఇతర పరికరాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

మిగతా 2లో..

# ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని కోరడం మా హక్కు

- రాహుల్ గాంధీపై విమర్శలకు మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందన
- ప్రజలే నాయకత్వాన్ని నిర్ణయిస్తారని వ్యాఖ్య
- కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు

**హైదరాబాద్, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ రాహుల్ గాంధీపై వస్తున్న విమర్శలకు స్పందిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఆశించడం కాంగ్రెస్ పార్టీ హక్కు అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది ఏ వ్యక్తి కాదని, ప్రజలే తుది నిర్ణయం తీసుకుంటారని ఆయన అన్నారు. ప్రజల విశ్వాసంపైనే పదవులు ఆధారపడి ఉంటాయని పేర్కొన్నారు. గత పన్నెండు సంవత్సరాలుగా దేశ ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారని కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

మిగతా 2లో..



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఐపీఎస్ కేటాయింపు పెంపుపై అమిత్ షాను కలిసిన సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

దేశంతో పాటు తెలంగాణ రాష్ట్రం సైబర్ నేరాలు, డ్రగ్స్, వైట్ కాలర్ నేరాలు సహా ఇతర అనేక ఆధునిక సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ, ఫ్యూచర్ సిటీ కమిషనర్, హైదరాబాద్ నగరంలో భారీగా పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఐపీఎస్ అధికారుల అవసరం ఉందని వివరించారు. మూడో క్యాడర్ రివ్యూను నిర్దేశిత 2026 సంవత్సరంలోనే చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 83 ఐపీఎస్ అధికారులు రాష్ట్రంలో ఉన్నారని, ఆ సంఖ్యను 103కు పెంచి కేటాయించాలని కోరారు. ఈ భేటీ సందర్భంగా మావోయిస్టుల లొంగుబాటుపై అమిత్ షా గారితో చర్చించారు. ఇటీవల మావోయిస్టు అగ్ర నాయకుల లొంగుబాటు, వారి పునరావాసం అంశాలు చర్చించారు. గత రెండేళ్లలో తెలంగాణ పోలీసింగ్‌లో గణనీయమైన మార్పులు వచ్చాయని ముఖ్యమంత్రి గారు తెలిపారు. రాష్ట్రంలో 591 మంది మావోయిస్టులు ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిసిన విషయాన్ని చెప్పారు. ఇటీవల కాలంలో పలువురు మావోయిస్టు అగ్రనేతలు కూడా సాధారణ జీవితం గడిపేందుకు ముందుకు వచ్చారని, వారికి నిబంధనల ప్రకారం అందజేస్తున్న పరిహారం, పునరావాసం విషయాలను కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి గారు వివరించారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించి సహకరించాలని కూడా కోరారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి గారు, రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి గారు, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ విజయ్ కుమార్ గారు, ఎస్ఐబి ఐజీపీ బి. సుమతి గారు పాల్గొన్నారు.

# అధికారుల బదిలీలతో పాలన దెబ్బతింటోంది

(మొదటి పేజీ తరువాయి)

విభాగాధిపతులు సగటున ఎనిమిది నెలలు కూడా ఒకే పదవిలో కొనసాగడం లేదని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ, సింగరేణి, జీహెచ్ఎంసీ, ఐ అండ్ పీఆర్, పాఠశాల విద్య, మున్సిపల్, పంచాయతీ రాజ్ వంటి అనేక శాఖల్లో అధికారులు తరచూ మారడంతో పాలనలో గందరగోళం నెలకొంటోందని విమర్శించారు. ఇప్పటివరకు దాదాపు 140 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేశారని, 20 మంది కలెక్టర్లను మార్చారని హరీశ్ రావు పేర్కొన్నారు. ఒక కలెక్టర్‌కు జిల్లాపై పూర్తి అవగాహన రావడానికి కనీసం ఆరు నెలలు పడుతుందని, అంతకంటే ముందే బదిలీ చేయడం వల్ల పరిపాలనలో ఫలితాలు రావడం లేదన్నారు. అధికారులకు నచ్చితే మంచి పోస్టింగ్‌లు, లేదంటే వెంటనే బదిలీలు చేస్తున్నారని ఆరోపించారు. పదవీ విరమణ చేసిన అధికారులకు సేవా పొడగింపులు ఇవ్వడం కూడా పెరిగిపోయిందని ఆయన విమర్శించారు. గతంలో ఇదే విషయంపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు అదే విధానాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తమ సూచనలను విమర్శలుగా కాకుండా నిర్మాణాత్మక సలహాలుగా స్వీకరించాలని హరీశ్ రావు కోరారు.

# ..కల్తీ నెయ్యి తయారీ కేంద్రంపై దాడి



(మొదటి పేజీ తరువాయి)

స్వాధీనం చేసుకున్న నెయ్యి మరియు పరికరాల మొత్తం విలువ సుమారు రూ.18 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ కల్తీ నెయ్యిని మార్కెట్లో విక్రయించేందుకు సిద్ధం చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

# హైదరాబాద్ నగర ప్రజలకు అందుబాటులోకి మరో రెండు చెరువులు

- **బమ్మ్రుకున్-ఉద్-దౌలా చెరువు ఈ నెల 6న ప్రారంభం**
- **కూకట్‌పల్లి నల్ల చెరువు త్వరలో ప్రారంభం**
- **చెరువుల పునరుద్ధరణతో నగరానికి కొత్త ఊపిరి**



**హైదరాబాద్, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు):** నగరంలోని చెరువుల పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా మరో రెండు చెరువులు త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. పాతబస్తీలోని బమ్మ్రుకున్ ఉద్‌దౌలా చెరువు, కూకట్‌పల్లిలోని నల్ల చెరువులను అభివృద్ధి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. ఈ నెల 6వ తేదీన బమ్మ్రుకున్ ఉద్‌దౌలా చెరువును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అనంతరం మరికొన్ని రోజుల్లో కూకట్‌పల్లి నల్ల చెరువును కూడా ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. హైడ్రా చేపట్టిన మొదటి దశలో మొత్తం ఆరు చెరువుల అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. వాటిలో అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను ఇప్పటికే ప్రారంభించారు. మిగతా చెరువుల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. రెండో దశలో నగరంలో మరో 14 చెరువులను అభివృద్ధి చేయాలని హైడ్రా ప్రణాళిక రూపొందిస్తోంది. చెరువుల పునరుద్ధరణ ద్వారా నగరంలోని పర్యావరణ పరిస్థితులను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పాతబస్తీలోని చారిత్రాత్మక బమ్మ్రుకున్‌ఉద్‌దౌలా చెరువును ఆక్రమణల నుంచి విముక్తి చేసి పూర్తిగా అభివృద్ధి చేశారు. చెరువు కట్టను బలపరిచి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిన్నారుల ఆట స్థలాలు, వృద్ధులు సేదతీరేందుకు విశ్రాంతి ప్రాంతాలు ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ ఔషధ గుణాలున్న మొక్కలు, నీడనిచ్చే చెట్లను నాటారు. భద్రత కోసం సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ చర్యలు చేపట్టారు. కూకట్‌పల్లి నల్ల చెరువును కూడా ఆక్రమణల నుంచి విముక్తి చేసి విస్తీర్ణాన్ని పెంచారు. మురుగు నీటి సమస్యలను పరిష్కరించి చెరువు పరిసరాలను పచ్చదనంతో తీర్చిదిద్దారు. వాకింగ్ ట్రాక్, పార్కులు, వినోద సదుపాయాలు కల్పించడంతో ప్రజలు దూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి సేదతీరుతున్నారు. చెరువుల పునరుద్ధరణతో నగరంలో వరద సమస్యలు తగ్గడమే కాకుండా భూగర్భ జలాలు కూడా పెరుగుతాయని అధికారులు తెలిపారు.

# మెడికల్ విద్యార్థులకు ఫీజు చెక్కుల పంపిణీ

- **కేటీఆర్ చేతుల మీదుగా ఆర్థిక సహాయం**
- **పేద విద్యార్థులకు అండగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**
- **బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా 16 మంది విద్యార్థులకు మద్దతు**

**హైదరాబాద్, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు):** పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా కల్పించే ఉద్దేశంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరోసారి సేవా కార్యక్రమం నిర్వహించారు. బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 16 మంది వైద్య విద్యార్థులకు వారి విద్యా సంవత్సరం ఫీజుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని విద్యార్థులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పేద కుటుంబాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన విద్యార్థులు వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సమాజానికి ఉపయోగపడేలా విద్యను అభ్యసించాలని సూచించారు. రాజకీయాలకే పరిమితం కాకుండా సమాజంలోని పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సేవా దృక్పథాన్ని ఆయన అభినందించారు.

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతోనే బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా వైద్య విద్య అభ్యసించే విద్యార్థులకు ఫీజుల భారం తగ్గేలా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వైద్య విద్యార్థులు మరియు వారి కుటుంబ సభ్యులు తమ చదువుకు అండగా నిలిచిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కేటీఆర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మంచి వైద్యులుగా మారి సమాజానికి సేవ చేస్తామని వారు పేర్కొన్నారు.



# ములుగు సాగునీటి ప్రాజెక్టులపై మంత్రుల సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)



ప్రాజెక్టుల అమలులో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి పనులు వేగంగా పూర్తిచేయాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. రైతులకు సాగునీరు అందేలా ప్రాజెక్టులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, నిరంతర పర్యవేక్షణతో పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ములుగు జిల్లాలో సాగునీటి వనరులు మెరుగుపడితే రైతులకు గణనీయంగా లాభం చేకూరుతుందని పేర్కొన్నారు. రైతులకు త్వరితగతిన నీటిని అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీని కోరడం మా హక్కు

(మొదటి పేజీ తరువాయి)

దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించారని, ధరలు పెరిగినా పేదలను ఆదుకునే చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. విపక్ష ప్రభుత్వాలను కూల్చేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తున్నారని కూడా ఆయన విమర్శించారు. దేశ ఐక్యత కోసం కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసిన రాహుల్ గాంధీను విమర్శించడం తగదని ఆయన పేర్కొన్నారు. అలాగే కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తన వ్యాఖ్యల శైలిని మార్చుకోవాలని సూచించారు.

# తెలంగాణ కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు ఖరారు





(మొదటి పేజీ తరువాయి)

మహబూబాబాద్ జిల్లాకు చెందిన వేం నరేందర్‌రెడ్డి.. సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పేరుపొందారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ నుంచి తెదేపా తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2012లో జరిగిన ఉప ఎన్నికలో హనుమకొండ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2015లో ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం చెందారు. అనంతరం రేవంత్‌రెడ్డితో పాటు వేం నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు.

# మాదిగలకు రాజ్యసభ సీటు ఇవ్వాలి: మంద కృష్ణ మాదిగ



- **కాంగ్రెస్‌పై ఎమ్మార్పీఎస్ నేత తీవ్ర విమర్శలు**
- **తెలంగాణ నుంచి మాదిగలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేదని ఆవేదన**
- **రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ**

**హైదరాబాద్, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ పార్టీ మాదిగ సామాజిక వర్గాన్ని రాజకీయంగా అణచివేస్తోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తీవ్ర స్థాయిలో విమర్శించారు. తెలంగాణ నుంచి మాదిగలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేకుండా చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. తెలంగాణకు చెందిన మాదిగ సామాజిక వర్గ నేతకు కాంగ్రెస్ పార్టీ తరఫున రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాసినట్లు తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కూడా మాదిగలకు టికెట్లు ఇవ్వలేదని, దీంతో ప్రస్తుతం పార్లమెంట్‌లో తెలంగాణ నుంచి మాదిగల గొంతు వినిపించే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఒక్క మాదిగ కూడా లేకపోవడం ఆ వర్గంపై పార్టీకి ఉన్న వివక్షకు నిదర్శనమని మంద కృష్ణ విమర్శించారు. మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని, కానీ కీలక పదవుల్లో తగిన ప్రాతినిధ్యం ఇవ్వడం లేదని మండిపడ్డారు. మాదిగలకు రాజకీయంగా తగిన గౌరవం కల్పించాలంటే వెంటనే రాజ్యసభ సీటు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి మాదిగలకు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా వారి సమస్యలు దేశ స్థాయిలో వినిపించే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## చిత్తశుద్ధితో ఇస్తేనే.. నిజమైన జకాత్




ఖమ్మం బ్యూరో, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు)

రంజాన్ పవిత్ర దినాలలో ముస్లిమ్ సోదరులకు జకాత్ ఇచ్చే సంప్రదాయం ఉంది. తమ ఆదాయంలో కనీసం 2.5 శాతం జకాత్ రూపంలో నిరుపేదలకు సాయం అందించాలని ప్రవక్త ఉద్బోధ. నమాజ్, జకాత్ ఇస్లామ్ మూల స్తంభాలు. జకాత్ను వ్యక్తిగతంగా చెల్లించడానికే పరిమితం కాకుండా, జకాత్ వ్యవస్థను స్థాపించాలన్నది ఖురాన్ పిలుపు. నమాజ్ను ఇంట్లోనే ఒంటరిగా చదువుకున్న దానికంటే మసీదుకు వెళ్లి సామూహికంగా ఆచరిస్తే ఎన్నోరెట్ల పుణ్యఫలం దక్కుతుంది. అలానే జకాత్ దానాన్ని వ్యక్తిగతంగా ఇవ్వడం కన్నా, సమష్టిగా వినియోగిస్తే అధిక పుణ్యం అని ఖురాన్ పేర్కొన్నది. జకాత్ డబ్బును ఏదో దానంగా ఇస్తున్నామని కాకుండా చిత్తశుద్ధిగా ఇవ్వాలి. కుడిచేత్తో ఇస్తే ఎడమచేతికి తెలియనంత గుప్తంగా ఇవ్వాలన్నది ప్రవక్త బోధనల సారాంశం. జకాత్ తీసుకునేవారికి ఆత్మాభిమానం దెబ్బతినకుండా సొమ్ము ఇచ్చే ఏర్పాటు చేయాలి. సమ ష్టిగా జకాత్ ఇవ్వడం వల్ల ఈ సమస్య ఉత్పన్నం కాదు. జకాత్ సొమ్ము వల్ల ఇచ్చేవారి సంపదలు కరిగిపోవు. శుద్ధి అవుతుంది. సమాజంలో పేదరిక నిర్మూలనకు ఇది చక్కని మార్గం. 'తమ సంపదను చిత్తశుద్ధితో కేవలం అల్లాహ్ సంతోషం పొందే ఉద్దేశంతో వ్యయపరచేవారి వ్యయాన్ని మెట్టప్రదేశంలో ఉన్న తోటతో పోల్చవచ్చు. భారీ వర్షం కురిస్తే అది రెట్టింపు పంటను ఇస్తుంది. ఒకవేళ భారీవర్షం కురవక, సన్నని జల్లు పడినా అదే దానికి చాలు. మీరు చేసేదంతా అల్లాహ్ దృష్టిలో ఉంది' అని ఖురాన్ వచనం. పవిత్ర మనసుతో ఇచ్చిన జకాత్ పరిపూర్ణమైనదని సెలవిచ్చారు ప్రవక్త.



## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

పెద్దమందడి,మార్చ్4(తెలంగాణ ముచ్చట్లు):

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పానుగంటి బాలయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందడం జరిగింది.ఈ సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి సూచనల మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.అంత్యక్రియల నిర్వహణ కోసం రూ.5,000/రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే తరపున కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మధిర శ్రీశైలం, వార్డు సభ్యులు రాములమ్మ, నరేష్, కృష్ణ, వెంకటయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## బీరోలు గ్రామంలో కత్తి దాడి ఘటన

- ముగ్గురు అరెస్ట్..బాధితుడు ఐసీయూలో చికిత్స.



ఖమ్మం బ్యూరో, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు): తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామంలో కత్తి దాడి ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన కుందూరు లాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో బీరోలు కమ్యూనిటీ హాల్ ముందు ఈ సంఘటన జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు డబ్బుల వ్యవహారం,ఇతరులతో తిరుగుతున్నాడనే అనుమానంతో గ్రామానికి చెందిన మిరియాల విక్రం రెడ్డి, వేల్పుల లింగరాజు, కట్ల మహేష్అనే ముగ్గురు వ్యక్తులు కుందూరు ఉదయ్పై దాడికి పాల్పడ్డారు. పదునైన కత్తితో పొడవడంతో ఉదయ్కు తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఉదయ్ను వెంటనే కిమ్స్ ఆసుపత్రికి తరలించి ఐసీయూలో చేర్పించారు. ప్రస్తుతం అతను ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

బాధితుడి తండ్రి ఇచ్చిన పిటిషన్ మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై జగదీష్ ఆసుపత్రిలో ఉదయ్ స్టేట్మెంట్ నమోదు చేశారు. అనంతరం నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు పోలీసులు తెలిపారు.

## వెల్టూర్ గురుకుల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

పెద్దమందడి,మార్చ్4(తెలంగాణ ముచ్చట్లు):



వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలోని జ్యోతిరావు పూలే బాలికల గురుకుల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పదవ తరగతి విద్యార్థినిలతో ప్రత్యేకంగా సమావేశమై వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత సాధించి రానున్న జూనియర్లకు ఆదర్శంగా నిలవాలని విద్యార్థినీలను కోరారు.క్రమశిక్షణతో చదివి లక్ష్యాన్ని సాధించాలని, సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.అనంతరం వసతి గృహంలో విద్యార్థినులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు.భోజన నాణ్యత, వంటశాల పరిశుభ్రత, మెనూ అమలు విధానం, తాగునీటి సదుపాయాలను తనిఖీ చేసి అధికారులకు తగిన సూచనలు చేశారు. పదవ తరగతి ఫలితాలపై గురుకుల పాఠశాల ఉపాధ్యాయులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..గత సంవత్సర ఫలితాలను విశ్లేషించి ఈసారి మరింత మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధించేలా కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక దృష్టి పెట్టి, బలహీన విద్యార్థినులకు అదనపు తరగతులు నిర్వహించాలని, రోజువారీ పరీక్షల ద్వారా పురోగతిని పరిశీలించాలని ఆదేశించారు.100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు సమిష్టిగా పనిచేయాలని కోరారు.చివరిగా విద్యార్థినులతో మాట్లాడి వసతి గృహంలో ఉన్న సమస్యలను తెలుసుకుని, అవసరమైన మెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దమందడి తహసిల్దార్ పాండు నాయక్, ఎంపీడీవో పరిణత, ఆర్ఐ గణేష్, గ్రామ సర్పంచ్ అశోక్, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, సంబంధిత అధికారులు, గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

## ముడుచింతలపల్లిలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం

మేడ్చల్ మల్కాజ్గిరి, మార్చ్ 04 (తెలంగాణ ముచ్చట్లు)





మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ముడుచింతలపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, అమ్మవారి అనుగ్రహంతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ సమాజ ఐక్యత కోసం ముదిరాజ్ సంఘం చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. గ్రామాభివృద్ధి మరియు సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ముదిరాజ్ సంఘం సభ్యులకు, గ్రామ పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మూడు చింతపల్లి చైర్మన్ జామ్ రవి, ముడుచింతలపల్లి కౌన్సిలర్ నీరజ్ గౌడ్, నాగ్సెట్పల్లి కౌన్సిలర్ నవీన్ నాయక్, లక్ష్మాపూర్ కౌన్సిలర్ చినలచ్చి సరిత శ్రీనివాస్ గౌడ్, చంద్రశేఖర్ యాదవ్, మండల అధ్యక్షులు తప్పెట్ల నరేందర్ గౌడ్, జనరల్ సెక్రటరీ మరియు కౌన్సిలర్ శ్రీకాంత్ రెడ్డి, జనరల్ సెక్రటరీ శ్రీశైలం, ఉపాధ్యక్షురాలు సింగం విజయలక్ష్మి, రమ్య, వంగ రవీందర్ రెడ్డి, సుధాకర్ నాయక్, వీరేష్ నాయక్, రాయ్ శ్రీకాంత్ రెడ్డి, అరుణ్, నరేష్పటేల్, గూగుల్ లోతు వెంకటేష్ నాయక్, మచ్చేందర్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

## స్వరూప్ నగర్లో రూ. 1.82 కోట్లతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

- అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం: మాజీ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్, మార్చ్ 04 (తెలంగాణ ముచ్చట్లు):



ఉప్పల్ నియోజకవర్గంలోని ఉప్పల్ డివిజన్ స్వరూప్ నగర్ కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితా పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆమె కాలనీ వాసులతో కలిసి రూ. 1.82 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇప్పటికే కాలనీలో రూ. 69 లక్షలతో అండర్గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి చేశామని, ప్రస్తుతం అత్యాధునిక సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు.అలాగే ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గ వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో స్వరూప్ నగర్ కాలనీ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, వెంకటేశ్వర్ రెడ్డి, సిద్దేశ్వర్, పూజారి హనుమంతు, సల్ల ప్రభాకర్ రెడ్డి, అమరేందర్ రావు, శ్రీనివాస రెడ్డి, జ్ఞానేశ్వర్, సత్యనారాయణ, ఆనంద్ ప్రభు, కుమార్, పిసటి అంజిరెడ్డి, వెంకటేష్, రాకేష్ నాయక్, సురేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడలో డ్రైనేజీ పనుల పరిశీలన

- రూ.4.55 కోట్ల బాక్స్ డ్రైన్ నిర్మాణం వేగవంతం చేయాలి
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ, మార్చి 04 (తెలంగాణ ముచ్చట్లు):





ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కుషాయిగూడ డివిజన్లో డ్రైనేజీ అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. వర్షాకాలంలో తరచుగా ఎదురయ్యే మురుగు నీటి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో రూ.4 కోట్ల 55 లక్షల వ్యయంతో బాక్స్ డ్రైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం శివ సాయి నగర్ ప్రాంతంలో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. పనుల నాణ్యత, పురోగతిపై సమీక్ష నిర్వహించి, ఎటువంటి లోపాలు లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ ప్రాజెక్టు పూర్తయిన తరువాత సాయి నగర్, శివ సాయి నగర్, మీనాక్షి నగర్ తదితర కాలనీల్లో వర్షపు నీటి నిల్వలు, మురుగు నీటి ముంపు సమస్యలు పూర్తిగా తగ్గుముఖం పడతాయని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీల సమాఖ్య సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష రోజు ఉద్రిక్తత విద్యార్థిని అస్వస్థతతో ఆసుపత్రికి తరలింపు

ఎల్కతుర్తి. మార్చ్ 4( తెలంగాణ ముచ్చట్లు)

ఎల్కతుర్తి మండల కేంద్రంలో పరీక్ష రోజు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కస్తూరీ బాలికల రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్. రమ్య అనే విద్యార్థిని ప్రమాదవశాత్తు గాయపడి, అనంతరం పరీక్ష రాస్తున్న సమయంలో అస్వస్థతకు గురైంది.

కాలేజీ ప్రాంగణంలో అకస్మాత్తుగా కోతులు రావడంతో భయపడిన ఆమె మెట్లపై నుంచి జారి కిందపడినట్లు సమాచారం. ఈ ఘటనలో ఆమెకు గాయాలు కావడంతో ప్రిన్సిపల్ మరియు సిబ్బంది వెంటనే ప్రాథమిక చికిత్స అందించారు. అదే రోజు మ్యాథ్స్ పరీక్ష ఉండటంతో ఉదయం 11:30 గంటల సమయంలో మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రానికి పంపించారు.

పరీక్ష రాస్తున్న సమయంలో కొద్దిసేపటికి ఆమె ముక్కులో నుంచి రక్తస్రావం ప్రారంభమవడంతో పరీక్షా కేంద్రంలో కలకలం రేగింది. పరీక్షా సిబ్బంది వెంటనే స్పందించి 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. అనంతరం ఆమెను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై మరింత సమాచారం కోసం అధికారులు విచారణ చేస్తున్నారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## హామీ నెరవేర్చిన పెద్దమందడి 8వ వార్డు సభ్యురాలు జంగం పద్మ

**పెద్దమందడి,మార్చ్4(తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి జిల్లా పెద్దమందడి 8వ వార్డు సభ్యురాలిగా ఎన్నికైన జంగం పద్మ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు.వార్డుకు చెందిన తోకల గోపాల్ ఇంటి ముందున్న కరెంటు స్తంభాన్ని తొలగిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు.అయితే కొన్ని కారణాల వల్ల వెంటనే స్తంభం తొలగించడం సాధ్యపడలేదు.అయినప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి సమస్య పరిష్కారానికి కృషి చేశారు.ఈ నేపథ్యంలో బుధవారం కరెంటు స్తంభాన్ని విజయవంతంగా తొలగించారు. దీంతో గోపాల్ కుటుంబ సభ్యులు వార్డు సభ్యురాలు జంగం పద్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు ఆమెను అభినందించారు.



## సోనియా గాంధీ నగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలించిన నాయకులు

- **చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నేమూరి మహేష్ గౌడ్**

**చర్లపల్లి, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు చర్లపల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నేమూరి మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో సోనియా గాంధీ నగర్ ఫేజ్-3 ప్రాంతంలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ పనుల నాణ్యత, పనుల పురోగతి, ప్రజలకు కలిగే సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు. పనులు నిబంధనలకు అనుగుణంగా, నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.కాలనీ ప్రజల సమస్యలను తెలుసుకుని, మిగిలిన అభివృద్ధి పనులను కూడా త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పద్మారెడ్డి, సత్యనారాయణ, పరుశురాం గౌడ్, రాజరత్నం, కనకయ్య, చందు, చర్క వెంకటేష్, సంతోష్, లక్ష్మణ్, వీరరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.స్థానికులు అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నందుకు హర్షం వ్యక్తం చేశారు.



## బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతున్న శ్రీనివాస్ రెడ్డిని పరామర్శించిన చిన్నారెడ్డి

**పెద్దమందడి,మార్చ్4(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, పెద్దమందడి మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై హైదరాబాద్‌లోని సిటీ న్యూరో హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా డాక్టర్ చిన్నారెడ్డి వైద్యులను కలిసి శ్రీనివాస్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అత్యుత్తమ వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.స్థానిక నాయకులు, అభిమానులు శ్రీనివాస్ రెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

## జ్ఞాన సరస్వతి దేవాలయంలో 22వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు

- **ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు**

**మల్కాజిగిరి, మార్చ్ 04 (తెలంగాణ ముచ్చట్లు):**



మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని ఈస్ట్ ఆనంద్ బాగ్ అనంత సరస్వతి నగర్‌లో వెలసిన శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ ద్వావింసతి (22వ) వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు బుధవారం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రారంభ వేడుకలకు మల్కాజిగిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయనకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.పూజా కార్యక్రమాల అనంతరం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ, 22 సంవత్సరాలుగా ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతుండటం ఆనందకరమని తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ వేడుకల్లో కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, వెంకట్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ రావు, వినోద్, సతీష్, కపిలేశ్వర్, సంపత్ గౌడ్, ప్రసాద్ తదితర పార్టీ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రిటైర్ ఏఆర్ కానిస్టేబుల్ ఎం.డి. గౌసుద్దీన్ మృతి

- **పోలీసు విభాగంలో విషాదం**

**ఎల్కతుర్తి, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు):**

హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సూరారం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏఆర్ (ఆర్మ్డ్ రిజర్వ్) కానిస్టేబుల్ ఎం.డి. గౌసుద్దీన్ అనారోగ్య కారణాలతో బుధవారం సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో మృతిచెందారు. ఆయన మృతి వార్త పోలీసు వర్గాల్లోనే కాకుండా స్వగ్రామంలో తీవ్ర విషాదాన్ని కలిగించింది.

గౌసుద్దీన్ గారు పోలీసు శాఖలో క్రమశిక్షణ, నిజాయితీ, విధేయతకు ప్రతీకగా నిలిచారు. విధి నిర్వహణలో భాగంగా హెడ్‌క్వార్టర్స్‌లో పలు సంవత్సరాలు సేవలందించారు. అదేవిధంగా ఏటూర్ నగరం, కాజీపేట, ములుగు, వర్ధన్నపేట ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించి ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు.

సేవాకాలంలో ప్రజలతో సౌహార్దపూర్వకంగా మెలిగి, సహచర సిబ్బందితో సన్నిహిత అనుబంధం పెంపొందించుకున్నారు. ఆయన ఆకస్మిక మరణం కుటుంబ సభ్యులకు తీరని లోటుగా మారింది.

గౌసుద్దీన్ గారి పార్థివదేహానికి పోలీసు అధికారులు, సిబ్బంది మరియు గ్రామస్తులు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి ఈ దుఃఖాన్ని తట్టుకునే ధైర్యం కలగాలని స్థానికులు ప్రార్థించారు.



## రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి

**ఎల్కతుర్తి, మార్చి 4( తెలంగాణ ముచ్చట్లు):**

ఎల్కతుర్తి మండలం నుంచి ముల్కనూర్ వెళ్లే రోడ్డుపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు.

స్థానికుల వివరాల ప్రకారం, వేగంగా వెళ్తున్న ఒక కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి ఆగకుండా అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నడుపుతున్న వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఆయన రింగులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడని తెలిసింది.



ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వెంకటేశ్వర్లును సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కారు ఆగకుండా వెళ్లిపోయిన నేపథ్యంలో హిట్ అండ్ రన్ కేసుగా విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్కతుర్తి నుంచి ముల్కనూర్‌కు కొత్తగా నిర్మించిన రోడ్డుపై హెచ్చరిక బోర్డులు, దిక్సూచులు ఏర్పాటు చేయకపోవడంతో చౌరస్తాకు సమీపంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. వెంటనే ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరుతున్నారు.



## మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రసాయన బంధంపై విస్తృతోపన్యాసం

**మల్కాజిగిరి, మార్చి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మల్కాజిగిరిలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "రసాయన బంధం" అనే అంశంపై విస్తృతోపన్యాస కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విద్యానగర్కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. లావణ్య హాజరై ఉపన్యసించారు. రసాయన బంధాల స్వభావం, అయానిక్ మరియు కోవేలెంట్ బంధాల మధ్య తేడాలు, వాటి లక్షణాలు, అణువుల నిర్మాణంలో బంధాల ప్రాధాన్యతను ఆమె సులభంగా వివరించారు.రసాయన బంధాల



అవగాహన ఔషధ తయారీ, పదార్థ శాస్త్రం, పరిశ్రమల అభివృద్ధి వంటి రంగాల్లో ఎంత ముఖ్యమో తెలియజేస్తూ, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఇలాంటి అకడమిక్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ అడవి రాజు ఆధ్వర్యంలో జరిగింది. అధ్యాపకులు జి.స్వాతి తదితరులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.





## బాచుపల్లిలో అగ్ని ప్రమాదం బాధితులను పరామర్శించిన ఎంపీ ఈటల రాజేందర్

**బాచుపల్లి, మార్చి 04 (తెలంగాణ ముచ్చట్లు):**

బాచుపల్లిలో ప్రగతినగర్-బాచుపల్లి రోడ్డులో జరిగిన అగ్ని ప్రమాదాన్ని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ బుధవారం పరిశీలించారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఆయన ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, పల్నాడు, నరసరావుపేట, గుంటూరు ప్రాంతాల నుంచి సుమారు 20 ఏళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి ఫర్నిచర్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న కుటుంబం ఈ ప్రమాదానికి గురైందన్నారు.పెదవారికి అందుబాటు ధరల్లో ఫర్నిచర్ విక్రయిస్తూ అదే ప్రదేశంలో నివసిస్తున్నారని తెలిపారు.కరెంట్ లైన్ తెగిపడటంతో అగ్ని ప్రమాదం సంభవించి, ఇరవై ఏళ్లుగా కష్టపడి సంపాదించుకున్న సర్వస్వం కళ్లముందే కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు కట్టుబట్టలతో మిగిలిపోయారని, ఈ ఘటన హృదయవిదారకమని పేర్కొన్నారు.స్థానిక ఎమ్మెల్యే వివేకానంద, మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు తదితర నాయకులతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించినట్లు తెలిపారు. మానవతా కోణంలో ప్రభుత్వం స్పందించాలని కోరుతూ, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తమవంతు సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. బాధితులు మళ్లీ వ్యాపారం ప్రారంభించేందుకు అవసరమైన సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.హైదరాబాద్ నగరంలో అనేక ప్రాంతాల్లో కరెంట్ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు.బిల్డింగ్‌లపై నిలబడితే చేతికి అందేలా ఉన్న విద్యుత్ తీగలు ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని తెలిపారు. అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ అమలు మాటలకే పరిమితమైందని విమర్శించారు.ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ సరైన భద్రతా చర్యలు లేవని పేర్కొంటూ, వెంటనే సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
గురువారం - 05 - మార్చి 2026




# మా పాతిల్లు ఒక వంశపు ఊపిరి..

మా పాతింటి మట్టి గోడలకు చెవులు ఇచ్చి
వినండి
'బాసడ' కుటుంబాల చరిత్ర చెపుతాయి.
ఆ ఇంటి గోడల్నిండా మా తాత ముత్తాతల
పురాస్మృతులే

అయి తాతలు చెమట పోగులతో
అల్లుకున్న పిట్ట గూడు మా పాతిల్లు
వాళ్ళ ఎముకలను ఎనుగర్రలుగా జేసి
నిలవెట్టుకున్న యవ్వనపు నీడ
ఇద్దరు కానరాకుంటైనా
కండ్లముందు కనపడే తలుపురెక్కలు.

బాధలకు పొక్కిలి కాకుంట
మెగుకున్న ఎర్రమన్ను పిడుస
కష్టనష్టాలు చూసి ఓదార్చిన కడుప.

మట్టి గోడలు జాజు అలుకులు
సున్నం పూతలు సుక్కల ముగ్గులు
నిండైన ప్రేమలకు
నిలవెత్తు రూపం మా పాతిల్లు.

ఆప్యాయత అనుబంధాలను
కలగలుపుకున్న మట్టి గోడల కోట మా
పాతిల్లు
ఎన్ని పుట్టుకలను చూసిందో, ఎందరి
చావులను
చూసి ఏడ్చిందో ఆ మట్టి గోడల నిండా
మా తాత ముత్తాతల చెమట వాసనలే.

పాతిల్లంటే
నాలుగు గోడలు పది దులాలు గాదు
మొగురం అంగిపోయిన శిథిలం గాదు
పడుపడు దోడుదోడైన ఇల్లైతే అస్సలుకే
గాదు
డంగు సున్నంతో పెనవేసుకున్న మా బసడ
కుటుంబాల దృడమైన బంధం.

వారసత్వం రాల్చిన పండుటాకులను
ఏరుకుంటూ...

కరుగుతున్న కలలా కళ్లముందు అన్నీ
గతించిపోతుంటే...
ఒకప్పుడు పుదిచ్చిన బోనంకుండలా
వెలిగిపోయిన మా పాతిల్లు
నేడు కాలం ప్రసవించని మరో
మొహంజదారోగా నిలబడింది.

కిర్రుమన్న పెద్ద దర్వాజా పలకరించే గాజుల
సడిలేక చిన్నవోగా,
అరుగంచుకు ఒరిగిన గుంజలతో...
ఎన్నెన్నో సంస్పందనలను
తన రంగు వెలిసిన గుండెల్లో పొదవుకొని...
అనుకోని అతిథిలా...అప్పుడప్పుడు వచ్చి తనపై
వాలే
ఒక బూడిదరంగు పిట్టతో చెలిమి చేసిన
'మా పాతిల్లు' వీడ్కోలు పలకని
విషాదాన్ని నెమరేసుకుంటున్న స్మృతివృక్షమై
నిలిచింది!

ఎన్నో పురుళ్ళు పోసుకున్నపాతింటి
వంటశాల
మా తాతలు, తండ్రులు మొదట కళ్ళు తెరిసిన
పర్ణశాల.
శిథిలమైన ఎడ్ల బండి ఒసిగొయ్యలు,
శిథిలమైన మట్టి గోడలను చూసినపుడు మా
'బసడ' కుటుంబాల బండెడు సంసారం
గోచరిస్తుంది.


మట్టి దిబ్బలకింద మా పాతిల్లు
మల్లొక పుట్టుకకు ఎదురుచూస్తున్నది.



~ బసడ సంపత్ యాదవ్

# వంట విషయంపై అత్తతో వివాదం

- గొడవ తర్వాత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య
- వరకట్న వేధింపుల ఆరోపణలు
- భర్త అరెస్ట్, అత్త కోసం గాలింపు




**బెంగళూరు, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు):** కర్ణాటక రాజధాని బెంగళూరులో విషాద ఘటన చోటుచేసుకుంది. వంట విషయంపై అత్తతో జరిగిన వివాదం నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సుష్మ (35) ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె గతంలో అమెరికాలోని ప్రముఖ సాంకేతిక సంస్థలో పనిచేసినట్లు సమాచారం. ఐదేళ్ల క్రితం బెంగళూరుకు చెందిన పునీత్ కుమార్‌తో ఆమె వివాహం జరిగింది. ఈ దంపతులకు నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు సుష్మకు అత్తతో తరచుగా చిన్న చిన్న విషయాలపై గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం వంట చేయడంపై ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. సుష్మ వంట చేయడాన్ని అత్త అనుమతించకపోవడంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురై ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా, వరకట్నం కోసం అత్తింటి వారు తమ కుమార్తెను వేధిస్తున్నారని సుష్మ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు భర్త పునీత్ కుమార్ను అరెస్టు చేశారు. మరోవైపు అత్త కల్పన ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# నామమాత్రమే చెక్‌పోస్టులు...పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు విడుదల

ఖమ్మం బ్యూరో,తెలంగాణ ముచ్చట్లు

అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని అధికారులు ప్రకటిస్తున్నప్పటికీ, ప్రస్తుతం మాత్రం కాకరవాయి గ్రామ పరిధిలో భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.
చెక్‌పోస్టుల వద్ద పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను కొద్ది సేపటికే విడుదల చేస్తున్నారనే వార్తలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి.
మండల పరిధిలోని కాకరవాయి గ్రామం నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు చెక్‌పోస్ట్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే వాటిని కేసులు నమోదు చేయకుండా, ఊరు చివరికి తీసుకెళ్లి వదిలివేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ముఖ్యంగా ఆ రెండు ట్రాక్టర్లు కూడా పిండిప్రోలు, కాకరవాయి గ్రామానికి చెందినవిగా సమాచారం వెలువడింది. ఈ ఘటన వెనుక అసలు కారణాలు ఏమిటన్నది స్పష్టంగా తెలియకపోవడం ప్రజల్లో అనుమానాలకు దారితీస్తోంది. ఒకవైపు అక్రమ ఇసుక రవాణాను అరికడుతున్నామని అధికారిక ప్రకటనలు వెలువడుతుండగా, మరోవైపు అధికార పార్టీ అండదండలతో దొడ్డి దారిన అనుమతులు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కొంతమంది స్థానిక నాయకులు, మండల స్థాయి పోలీసు అధికారుల సహకారంతోనే ఈ వ్యవహారం జరుగుతోందని ప్రతిపక్ష వర్గాలు విమర్శిస్తున్నాయి. చెక్‌పోస్టులు నామమాత్రంగానే ఉన్నాయా? లేక నిజంగానే అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటున్నారా? అన్న ప్రశ్నలకు సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ప్రజలు కోరుతున్నారు. అక్రమ ఇసుక రవాణాను పూర్తిగా అరికట్టాలంటే పారదర్శకంగా వ్యవహరించాలని, పట్టుబడిన వాహనాలపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి నిజానిజాలు వెలికితీయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# కుందన్‌పల్లి సమీపంలో బైక్ ప్రమాదం

- అపస్మారక స్థితిలో యువకుడు ఆసుపత్రికి తరలింపు

**కీసర, మార్చి 04 (తెలంగాణ ముచ్చట్లు):**
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర మండలం రాంపల్లి దాయర గ్రామానికి చెందిన వెంకటేష్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. పెయింటింగ్ పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా కుందన్‌పల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటేష్ తలకు తీవ్ర గాయం కావడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటీ చిత్రం రవి, పైలెట్ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడికి అంబులెన్స్‌లోనే ప్రాథమిక అత్యవసర చికిత్స అందించారు. అనంతరం అతన్ని మెరుగైన వైద్యం కోసం గాంధీ హాస్పిటల్ కు తరలించారు. సమయానికి స్పందించి బాధితుడికి చికిత్స అందించిన 108 సిబ్బందిని గాంధీ ఆసుపత్రి వైద్యులు అభినందించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.



# కోడవటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మాజీ ఎంపి సీతారాం నాయక్ ప్రత్యేక పూజలు

**భూపాలపల్లి, మార్చ్4 (తెలంగాణ ముచ్చట్లు):**

భూపాలపల్లి జిల్లా కోడవటంచలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మాజీ పార్లమెంట్ సభ్యుడు ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ గర్భగుడి సన్నిధిలో వేదమంత్రాల మధ్య పూజారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, పూజారులు దంపతులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పూజా కార్యక్రమం అనంతరం ఆలయ పూజారి, ఆలయ చైర్మన్ మరియు సభ్యులకు మాజీ పార్లమెంట్ సభ్యుడు అజ్మీర సీతారాం నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.






# మాదిగ సామాజిక వర్గానికి చెందిన దొమ్మటి సాంబన్నకు రాజ్యసభ ఇవ్వాలి


**హన్మకొండ,మార్చి04 (తెలంగాణ ముచ్చట్లు):**

మాదిగ సామాజిక వర్గానికి చెందిన,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దొమ్మటి సాంబన్నకు రాజ్యసభ సీటు కేటాయించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి పెండ్యాల సుమన్ కోరారు. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరిన సాంబన్న, ఆ రోజునుంచి పార్టీకి నిస్వార్థంగా సేవలు అందిస్తూ వస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రికి సన్నిహితుడిగా, పార్టీ అధిష్టానానికి నమ్మిన వ్యక్తిగా సాంబన్న మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు.
ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో సీఐ పదవికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చిన సాంబన్న, అప్పటి నుంచి పేదల పక్షాన నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజల్లో ఉండి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తూ మంచి పేరు తెచ్చుకున్న నాయకుడిగా నిలిచారని వివరించారు. పార్టీలో ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న సాంబన్నకు మాదిగ సామాజిక వర్గం నుంచి రాజ్యసభ సభ్యత్వం ఇవ్వడం ద్వారా పార్టీని నమ్ముకున్న నాయకులకు అండగా ఉంటుందని నిరూపించుకోవాలని ఆయన సూచించారు.



# పహల్గాం ఉగ్రదాడి కేసులో చైనా సహాయం కోరిన ఎన్ఐఏ కోర్టు

- గోప్రో కెమెరా వివరాలపై విచారణ
- చైనా న్యాయాధికారులకు లేఖ
- ఉగ్రదాడి కుట్రపై కీలక ఆధారాల అన్వేషణ



**జమ్మూ, మార్చి 4 (తెలంగాణ ముచ్చట్లు):** గత ఏడాది జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ కేసును జమ్మూలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు విచారిస్తోంది. దాడి సమయంలో స్వాధీనం చేసుకున్న గోప్రో హీరో 12 బ్లాక్ కెమెరాకు సంబంధించిన వివరాల కోసం కోర్టు చైనా సహాయం కోరింది. ఎన్ఐఏ చట్టం ప్రకారం జమ్మూలోని ప్రత్యేక న్యాయమూర్తి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ అంశంపై ఎన్ఐఏ డీఐజీ సందీప్ చౌదరీ దాఖలు చేసిన దరఖాస్తును పరిశీలించిన కోర్టు, బీఎన్ఎస్ఎస్ చట్టంలోని సెక్షన్ 112 ప్రకారం చైనాలోని సంబంధిత న్యాయాధికారులకు లేఖ రాయాలని సూచించింది. పహల్గాం ఘటన స్థలం నుంచి స్వాధీనం చేసుకున్న గోప్రో హీరో 12 బ్లాక్ కెమెరా ద్వారా దాడికి ముందు జరిగిన కదలికలు, కుట్ర వివరాలు బయటపడే అవకాశం ఉందని ఎన్ఐఏ భావిస్తోంది. ఆ కెమెరాను ఎవరు కొనుగోలు చేశారు, ఎవరు వినియోగించారు, దానికి సంబంధించిన సాంకేతిక రికార్డులు అందించాలని కోర్టు చైనాను కోరింది. దర్యాప్తులో భాగంగా ఆ కెమెరాను చైనాలోని ఏఈ గ్రూప్ అనే సంస్థకు సరఫరా చేసినట్లు తెలిసింది. అది 2024 జనవరి 30న చైనాలోని డాంగౌన్ ప్రాంతంలో యాక్టివేట్ అయినట్లు సమాచారం. అయితే ఆ కెమెరా కొనుగోలు లావాదేవీల వివరాలు లేదా చివరిగా వాడిన వ్యక్తి గురించి రికార్డులు లేవని తయారీదారులు వెల్లడించినట్లు దరఖాస్తులో పేర్కొన్నారు.

# ఇరాన్ కొత్త సుప్రీం నేతను కూడా వదిలిపెట్టమని ఇజ్రాయెల్ హెచ్చరిక

- సుప్రీం లీడర్‌పై దాడుల తర్వాత ఉద్రిక్తత
- కొత్త నేతను కూడా లక్ష్యంగా చేసుకుంటామని హెచ్చరిక
- అమెరికా సహకారంతో చర్యలు కొనసాగుతాయని ప్రకటన



ఇరాన్ తదుపరి సుప్రీం లీడర్‌గా ఎంపికయ్యే వ్యక్తిని కూడా నిర్మూలించడమే లక్ష్యంగా పెట్టుకుంటామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి చెందిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. ఖమేనీ మరణించి నాలుగు రోజులు గడిచినా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండటంతో ప్రాంతీయ ఉద్రిక్తత మరింత పెరిగింది. ఇజ్రాయెల్‌ను నాశనం చేయాలనుకునే వారిని, అమెరికాను బెదిరించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని కాట్జ్ హెచ్చరించారు. ప్రపంచాన్ని బెదిరించే విధంగా పనిచేసే ఏ నాయకుడినైనా అంతం చేస్తామని స్పష్టం చేశారు. ఇరాన్‌లో కొత్త సుప్రీం లీడర్‌గా ఎవరిని ఎన్నుకున్నా, వారు ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టబోమని ఆయన తెలిపారు. అమెరికా భాగస్వామ్యంతో ఇరాన్ పాలన సామర్థ్యాలను పూర్తిగా నిర్వీర్యం చేసే చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు.
ఇదిలా ఉండగా, ఖమేనీ రెండో కుమారుడు ముజ్తబా ఖమేనీను ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఎన్నుకునే ప్రక్రియ జరుగుతోందన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్‌తో అతనికి బలమైన సంబంధాలు ఉన్నాయని, త్వరలో బాధ్యతలు చేపట్టే అవకాశముందని అంతర్జాతీయ వర్గాలు భావిస్తున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




## మధ్యప్రాచ్యంలో అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు

- కమ్యూనికేషన్, రాడార్ వ్యవస్థలకు భారీ నష్టం
- ఖతార్‌లో కీలక రాడార్ కేంద్రం ధ్వంసం
- డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో ప్రతీకార దాడులు

న్యూయార్క్, మార్చి 4 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ తీవ్ర దాడులకు పాల్పడింది. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన కీలక కమ్యూనికేషన్ మరియు రాడార్ వ్యవస్థలు దెబ్బతిన్నట్లు సమాచారం. ముఖ్యంగా ఖతార్‌లో ఉన్న అమెరికా సైనిక రాడార్ కేంద్రం ఇరాన్ దాడుల్లో ధ్వంసమైనట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే యుద్ధ వాతావరణంతో ఉద్రిక్తంగా ఉన్న ప్రాంతంలో ఈ ఘటనతో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారాయి. ది న్యూయార్క్ టైమ్స్ విశ్లేషణ ప్రకారం కనీసం ఏడు అమెరికా సైనిక స్థావరాల్లో కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఉపగ్రహ చిత్రాలు, ధృవీకరించిన వీడియోల ఆధారంగా ఈ వివరాలు వెల్లడించినట్లు పేర్కొంది. బాలిస్టిక్ క్షిపణులను గుర్తించే వ్యవస్థలు, శాటిలైట్ డిష్‌లు, సున్నితమైన పరికరాలను రక్షించే రాడోమ్ నిర్మాణాల వద్ద భారీ నష్టం జరిగినట్లు నివేదికలో వెల్లడైంది. అమెరికా సైనిక సమాచార వ్యవస్థ అత్యంత రహస్యంగా ఉన్నప్పటికీ లక్ష్యాలను బట్టి చూస్తే వారి కమ్యూనికేషన్ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే ఇరాన్ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు కొనసాగిస్తున్నాయి. దీనికి ప్రతీకారంగానే తాము దాడులు చేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్, కువైట్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాల్లో ఉన్న అమెరికా స్థావరాలపై డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ దాడులు చేస్తున్నట్లు సమాచారం. గత జూన్‌లో కూడా ఖతార్‌లోని ఒక అమెరికా స్థావరంపై ఇరాన్ దాడి చేసి కమ్యూనికేషన్ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుంది. ఇప్పుడు మళ్లీ అదే స్థావరంపై దాడి జరగడం గమనార్హం. ఒకవైపు అమెరికాఇజ్రాయెల్ దాడులు, మరోవైపు ఇరాన్ ప్రతీకార చర్యలతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి.వ



## శ్రీలంక సమీపంలో మునిగిన ఇరాన్ యుద్ధనౌక

- సబ్‌మెరైన్ దాడితో ముంచేశామని అమెరికా ప్రకటన
- 'ఐరిస్ దేనా' నౌకలో 180 మంది సిబ్బంది
- 32 మందిని రక్షించిన శ్రీలంక నావికాదళం

కొలంబో: శ్రీలంక తీరానికి సమీపంలో ఇరాన్‌కు చెందిన యుద్ధనౌక మునిగిపోయిన ఘటనపై అమెరికా స్పందించింది. తమ సబ్‌మెరైన్ దాడి కారణంగానే ఆ నౌక మునిగిపోయిందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ ప్రకటించారు. ఈ దాడి అంతర్జాతీయ జలాల్లోనే జరిగినదని ఆయన స్పష్టం చేశారు. శ్రీలంక దక్షిణ తీరానికి సమీపంలో బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. శ్రీలంక విదేశాంగ మంత్రి విజిత హెరత్ పార్లమెంట్‌లో వెల్లడించిన వివరాల ప్రకారం మునిగిపోయిన నౌకను ఇరాన్‌కు చెందిన 'ఐరిస్ దేనా'గా గుర్తించారు. ఈ నౌకలో దాదాపు 180 మంది సిబ్బంది ఉన్నట్లు సమాచారం. బుధవారం ఉదయం 6 నుంచి 7 గంటల మధ్య నౌక నుంచి ప్రమాద సంకేతాలు అందడంతో వెంటనే శ్రీలంక నావికాదళం, వాయుసేన అప్రమత్తమయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. ఇప్పటివరకు 32 మందిని రక్షించి గాలేలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఘటనా స్థలంలో నీటిపై చమురు తెట్టు మాత్రమే కనిపిస్తోందని, నౌక పూర్తిగా మునిగిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. శ్రీలంక భూభాగ జలాలకు వెలుపల ఈ ఘటన జరిగినప్పటికీ మానవతా దృక్పథంతో రక్షణ చర్యలు చేపట్టినట్లు శ్రీలంక నేవీ ప్రతినిధి బుద్ధిక సంపత్ తెలిపారు. ఇటీవల బంగాళాఖాతంలో ఫిబ్రవరి 18 నుంచి 25 వరకు జరిగిన నావికా విన్యాసాల్లో ఈ నౌక పాల్గొన్నట్లు సమాచారం. సముద్రంలో కొన్ని మృతదేహాలు కనిపించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

## యుద్ధంలోకి మమ్మల్ని లాగవద్దు: స్పెయిన్ ప్రధాని సాంచెజ్

- శాంతిని కోరుకున్నందుకు ఆంక్షలు సరికాదని వ్యాఖ్య
- ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో స్పందన
- యుద్ధం మానవాళికి విపత్తు అని హెచ్చరిక

మాడ్రిడ్, మార్చి 4 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి): మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు అంతర్జాతీయ దౌత్య యుద్ధానికి దారితీస్తున్న నేపథ్యంలో స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మరో యుద్ధంలోకి తమ దేశాన్ని లాగవద్దని, శాంతిని కోరుకుంటున్నందుకు తమపై ఆంక్షలు విధించడం సరైంది కాదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పెయిన్‌తో వాణిజ్య సంబంధాలను తెంచుకుంటామని హెచ్చరించిన నేపథ్యంలో సాంచెజ్ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఇరాన్‌పై యుద్ధం ప్రకటిస్తున్న దేశాల లక్ష్యాల్లో స్పష్టత లేదని ఆయన పేర్కొన్నారు. స్పెయిన్ ఎన్నడూ ఇలాంటి రక్తపాతాన్ని కోరుకోదని సాంచెజ్ అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ దేశాలు యుద్ధాన్ని ఆపాలని పలు దేశాలు చేసిన తీర్మానాల తర్వాతే తాము శాంతి కోరుతున్నామని గుర్తుచేశారు. ఒక దేశం చేసే చట్టవిరుద్ధ చర్యలకు మరో దేశం అదే విధంగా ప్రతిస్పందించడం వల్ల ప్రపంచానికి భారీ విపత్తులు తప్పవని ఆయన హెచ్చరించారు. యుద్ధం కొనసాగితే మానవాళికి తీవ్ర నష్టం జరుగుతుందని స్పష్టం చేశారు.

# ఇరాన్ యుద్ధంలో అమెరికా ఏఐ టెక్నాలజీ వినియోగం

- 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తో స్మార్ట్ డ్రోన్ల వినియోగం
- 2 వేలకుపైగా లక్ష్యాల ధ్వంసం
- ఇరాన్ క్షిపణి దాడులు 86 శాతం తగ్గినట్లు వెల్లడి



ఇరాన్‌తో కొనసాగుతున్న సైనిక ఘర్షణలో అమెరికా సరికొత్త సాంకేతికతను వినియోగిస్తున్నట్లు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ వెల్లడించారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో చేపట్టిన ఈ సైనిక చర్యల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అటానమస్ వ్యవస్థలను వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు.


పెంటగాన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏఐ సామర్థ్యాలున్న స్మార్ట్ డ్రోన్లు, ఇతర ఆధునిక వ్యవస్థలను యుద్ధంలో వినియోగిస్తున్నామని చెప్పారు. అయితే భద్రతా కారణాల దృష్ట్యా వాటికి సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించలేమని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు 2 వేలకుపైగా లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు అమెరికా సంయుక్త సైనిక దళాల ప్రధాన అధికారి డాన్ కెయిన్ తెలిపారు. ప్రధానంగా మూడు లక్ష్యాలతో ఈ దాడులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేయడం, వారి నౌకాదళాన్ని బలహీనపరచడం, తిరిగి సైనిక సామర్థ్యాన్ని వేగంగా పునరుద్ధరించకుండా చేయడమే ఈ ఆపరేషన్ ఉద్దేశమని వివరించారు. అమెరికా సైన్యం యుద్ధ వ్యూహాన్ని కూడా మార్చినట్లు అధికారులు తెలిపారు. గతంలో దూరం నుంచి దాడులు చేయగా, ఇప్పుడు నేరుగా ఇరాన్ గగనతలంలోకి ప్రవేశించి కచ్చితమైన లక్ష్యాలపై దాడులు చేస్తున్నామని తెలిపారు. తమ దాడుల తర్వాత ఇరాన్ క్షిపణి ప్రయోగాల తీవ్రత గణనీయంగా తగ్గిందని, యుద్ధం ప్రారంభమైనప్పటి కంటే ఇవి 86 శాతం తగ్గినట్లు వెల్లడించారు. అయితే ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతూనే ఉందని, ఇది అత్యంత సంక్లిష్టమైనదిగా, ప్రమాదకరమైనదిగా ఉందని అమెరికా సైన్యం పేర్కొంది.

## ఇరాన్‌పై దాడికి మోదీ పర్యటనతో సంబంధం లేదు: ఇజ్రాయెల్ రాయబారి

- ప్రచారాలను ఖండించిన రూవెన్ అజర్
- అభివృద్ధి అంశాలపైనే చర్చలు జరిగాయని స్పష్టం
- భద్రతా కేబినెట్ ఆమోదం తర్వాతే దాడులు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన అనంతరం ఇరాన్‌పై దాడులు జరగడంపై వివిధ రకాల ప్రచారాలు సాగుతున్న నేపథ్యంలో భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ స్పందించారు. ఇరాన్‌పై జరిగిన దాడులకు మోదీ పర్యటనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఫిబ్రవరి 25, 26 తేదీలలో మోదీ రెండు రోజుల పాటు ఇజ్రాయెల్ పర్యటించిన విషయం తెలిసిందే. అయితే ఆయన పర్యటన ముగిసిన రెండు రోజుల తర్వాత ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడులు చేపట్టింది. ఈ దాడుల గురించి మోదీకి ముందే సమాచారం ఉందని కొందరు ప్రచారం చేయడం సరైంది కాదని రూవెన్ అజర్ పేర్కొన్నారు.


మోదీ పర్యటన సందర్భంగా రెండు దేశాల అభివృద్ధి, ద్వైపాక్షిక సహకారం వంటి అంశాలపైనే చర్చలు జరిగాయని తెలిపారు. యుద్ధానికి సంబంధించిన విషయాలపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఆ సమయంలో ఇరాన్‌పై దాడి చేస్తామనే విషయం తమకు కూడా తెలియదని పేర్కొన్నారు. మోదీ ఇజ్రాయెల్ నుంచి వెళ్లిపోయిన తర్వాతే ఇరాన్‌పై దాడి చేసే అవకాశం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఫిబ్రవరి 28న ఉదయం భద్రతా కేబినెట్ ఈ చర్యలకు ఆమోదం తెలిపిన తర్వాతే దాడులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. ఇరాన్‌పై దాడులకు సంబంధించి అమెరికాతో చాలా కాలంగా సంప్రదింపులు కొనసాగుతున్నాయని కూడా ఆయన తెలిపారు. సరైన సమయం కోసం వేచి చూస్తున్నామని, ఆ అవకాశం ఇప్పుడు లభించడంతో దాడులు చేపట్టినట్లు రూవెన్ అజర్ పేర్కొన్నారు.



# నెతన్యాహు జర్మనీకి వెళ్లారనే ప్రచారం తప్పు

- 'వింగ్ ఆఫ్ జియోన్' విమానం బెర్లిన్‌లో కనిపించడంతో ఊహాగానాలు
- టెల్ అవీవ్‌లోనే ఉన్నారని ప్రధాని కార్యాలయం స్పష్టం
- భద్రతా కారణాలతో విమానం జర్మనీకి వెళ్లినట్లు వివరణ

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు దేశం విడిచి జర్మనీకి వెళ్లిపోయారనే ప్రచారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం స్పష్టం చేసింది. ఇజ్రాయెల్ ప్రభుత్వానికి చెందిన అత్యంత భద్రత కలిగిన 'వింగ్ ఆఫ్ జియోన్' విమానం జర్మనీ రాజధాని బెర్లిన్‌లోని బ్రాండన్‌బర్గ్ విమానాశ్రయంలో కనిపించడం ఈ ప్రచారానికి కారణమైంది. ఆ విమానం ల్యాండ్ అవుతున్న దృశ్యాలను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో నెతన్యాహు జర్మనీకి వెళ్లారని ఊహాగానాలు మొదలయ్యాయి. సాధారణంగా దేశాధినేతలు, ప్రధానులు ఇలాంటి ప్రత్యేక విమానాల్లోనే ప్రయాణించడం వల్ల ఈ వార్తలు మరింత వేగంగా వ్యాపించాయి. ఇరాన్ దాడులకు భయపడి నెతన్యాహు దేశం విడిచి వెళ్లిపోయారని పాలస్తీనా అనుకూల వర్గాలు కూడా సోషల్ మీడియాలో ప్రచారం చేశాయి. అయితే దీనిపై స్పందించిన ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం ఆయన టెల్ అవీవ్‌లోని తన కార్యాలయంలోనే ఉన్నారని వెల్లడించింది. ఇరాన్ పరిస్థితుల నేపథ్యంలో రక్షణ అధికారులతో జరిగిన హైసెక్యూరిటీ సమావేశంలో నెతన్యాహు పాల్గొన్నట్లు అధికారులు



తెలిపారు. దీనికి సంబంధించిన ఫోటోలను కూడా విడుదల చేశారు. అలాగే ఇరాన్ క్షిపణి దాడులకు గురైన ప్రాంతాలను ఆయన పరిశీలిస్తున్న వీడియోలను కూడా పంచుకున్నారు. దీంతో నెతన్యాహు ఇంకా ఇజ్రాయెల్‌లోనే ఉన్నారని స్పష్టమైంది. భద్రతా కారణాల రీత్యా అధికారిక విమానం మాత్రమే బెర్లిన్‌కు వెళ్లినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నెతన్యాహు జర్మనీకి వెళ్లారనే ప్రచారం పూర్తిగా అసత్యమని తేలింది.

## ఇరాన్‌పై దాడికి మోదీ పర్యటనతో సంబంధం లేదు: ఇజ్రాయెల్ రాయబారి

- ప్రచారాలను ఖండించిన రూవెన్ అజర్
- అభివృద్ధి అంశాలపైనే చర్చలు జరిగాయని స్పష్టం
- భద్రతా కేబినెట్ ఆమోదం తర్వాతే దాడులు





న్యూఢిల్లీ, మార్చి 4 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటన అనంతరం ఇరాన్‌పై దాడులు జరగడంపై వివిధ రకాల ప్రచారాలు సాగుతున్న నేపథ్యంలో భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబారి రూవెన్ అజర్ స్పందించారు. ఇరాన్‌పై జరిగిన దాడులకు మోదీ పర్యటనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఫిబ్రవరి 25, 26 తేదీలలో మోదీ రెండు రోజుల పాటు ఇజ్రాయెల్ పర్యటించిన విషయం తెలిసిందే. అయితే ఆయన పర్యటన ముగిసిన రెండు రోజుల తర్వాత ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడులు చేపట్టింది. ఈ దాడుల గురించి మోదీకి ముందే సమాచారం ఉందని కొందరు ప్రచారం చేయడం సరైంది కాదని రూవెన్ అజర్ పేర్కొన్నారు.

మోదీ పర్యటన సందర్భంగా రెండు దేశాల అభివృద్ధి, ద్వైపాక్షిక సహకారం వంటి అంశాలపైనే చర్చలు జరిగాయని తెలిపారు. యుద్ధానికి సంబంధించిన విషయాలపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ఆ సమయంలో ఇరాన్‌పై దాడి చేస్తామనే విషయం తమకు కూడా తెలియదని పేర్కొన్నారు. మోదీ ఇజ్రాయెల్ నుంచి వెళ్లిపోయిన తర్వాతే ఇరాన్‌పై దాడి చేసే అవకాశం వచ్చినట్లు ఆయన తెలిపారు. ఫిబ్రవరి 28న ఉదయం భద్రతా కేబినెట్ ఈ చర్యలకు ఆమోదం తెలిపిన తర్వాతే దాడులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. ఇరాన్‌పై దాడులకు సంబంధించి అమెరికాతో చాలా కాలంగా సంప్రదింపులు కొనసాగుతున్నాయని కూడా ఆయన తెలిపారు. సరైన సమయం కోసం వేచి చూస్తున్నామని, ఆ అవకాశం ఇప్పుడు లభించడంతో దాడులు చేపట్టినట్లు రూవెన్ అజర్ పేర్కొన్నారు.

# ఎక్స్‌లో ఏఐ కంటెంట్‌పై కొత్త నిబంధనలు

సామాజిక మాధ్యమ వేదిక లో కృత్రిమ మేధస్సుతో రూపొందించిన విషయాలపై కఠిన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. ముఖ్యంగా యుద్ధాలకు సంబంధించిన దృశ్యాలను కృత్రిమ మేధస్సుతో సృష్టించి వాటిని నిజమైనవిగా ప్రచారం చేసే వారిపై గట్టి చర్యలు తీసుకుంటామని సంస్థ ప్రకటించింది.

కృత్రిమ మేధస్సుతో తయారుచేసిన వీడియోలు, చిత్రాలు లేదా ఇతర విషయాలను తప్పనిసరిగా అవి కృత్రిమ మేధస్సుతో రూపొందించబడినవేనని స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించింది. ఒకవేళ అలాంటి విషయాలను నిజమైన సంఘటనలుగా చూపించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తే, సంబంధిత ఖాతాలను తొంభై రోజుల పాటు ఆదాయం పొందే కార్యక్రమం నుంచి నిలిపివేస్తామని వెల్లడించింది. రెండోసారి కూడా నిబంధనలు ఉల్లంఘిస్తే శాశ్వతంగా ఆ కార్యక్రమం నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. ఈ విషయాన్ని సంస్థ ఉత్పత్తుల విభాగాధిపతి వెల్లడించారు. యుద్ధ సమయాల్లో తప్పుడు సమాచారం వేగంగా వ్యాపించే ప్రమాదం ఉన్నందున వాస్తవికతను కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సమూహ సూచనలు, సాంకేతిక గుర్తింపు విధానాల ద్వారా ఇలాంటి తప్పుడు విషయాలను గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



ఇదిలా ఉండగా, ఎక్స్ యజమాని సంపద మరోసారి చర్చనీయాంశమైంది. ఆయనకు చెందిన అంతరిక్ష సంస్థ మరియు కృత్రిమ మేధస్సు రంగ సంస్థ విలువ పెరగడంతో ఆయన ఆస్తుల మొత్తం విలువ 852 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఆర్థిక వర్గాలు వెల్లడించాయి. ప్రపంచంలోనే అత్యధిక సంపద కలిగిన వ్యక్తిగా ఆయన కొత్త రికార్డు సృష్టించినట్లు సమాచారం.

కృత్రిమ మేధస్సు వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో వాస్తవికత, పారదర్శకత కాపాడటానికి ఎక్స్ తీసుకున్న ఈ నిర్ణయం సామాజిక మాధ్యమ రంగంలో కీలక పరిణామంగా భావిస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# భారీ నష్టాల్లో ముగిసిన షేర్ మార్కెట్లు

మధ్యప్రాచ్యంలో నెలకొన్న యుద్ధ వాతావరణం భారతీయ షేర్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. మరియు దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్టుబడిదారులు భయాందోళనలకు గురై భారీగా అమ్మకాలకు దిగారు. ఫలితంగా వరుసగా మూడో రోజు కూడా దలాల్ వీధిలో సూచీలు క్షీణించాయి.

ఈరోజు లావాదేవీలు ముగిసే సమయానికి 1.40 శాతం నష్టంతో 79,116 వద్ద ముగిసింది. ఒక దశలో వెయ్యికి పైగా పాయింట్లు కోల్పోయి గణనీయంగా పడిపోయింది. మరోవైపు 50 385 పాయింట్లు తగ్గి 24,480 వద్ద స్థిరపడింది. గత ఆరు నెలల్లో ఇదే అత్యల్ప స్థాయిగా నమోదు కావడం గమనార్హం.

ప్రముఖ సంస్థల షేర్లతో పాటు మధ్యతరహా, చిన్నతరహా సూచీలు కూడా రెండు శాతానికి పైగా క్షీణించాయి. లోహ రంగం, బ్యాంకింగ్ రంగం, స్థిరాస్తి రంగాలకు చెందిన షేర్లు భారీగా పడిపోయాయి. దీంతో పెట్టుబడిదారుల సంపద గణనీయంగా ఆవిరైంది. అయితే సమాచార సాంకేతిక రంగానికి చెందిన షేర్లు స్వల్ప లాభాలతో నిలిచి కొంత ఊరటనిచ్చాయి. ప్రస్తుతం నిఫ్టీకి 24,200 వద్ద కీలక ఆధార స్థాయి ఉందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఆ స్థాయి కూడా దాటితే మార్కెట్ మరింత దిగజారే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వంటి ప్రముఖ సంస్థల షేర్లు ఈరోజు భారీగా నష్టపోయాయి. మార్కెట్ మళ్లీ కోలుకోవాలంటే నిఫ్టీ కనీసం 25,000 స్థాయిని అధిగమించాల్సి ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. అంతర్జాతీయ పరిణామాలను గమనిస్తూ కొత్త పెట్టుబడుల విషయంలో ఆచితూచి అడుగులు వేయడం మంచిదని వారు అభిప్రాయపడుతున్నారు. పరిస్థితులు చక్కబడే వరకు జాగ్రత్తగా వ్యవహరించడం సురక్షిత మార్గమని చెబుతున్నారు.




# జొమాటో, స్విగ్గీలకు పోటీగా ర్యాపిడో 'ఓన్లీ'

దేశంలో ఆన్‌లైన్ భోజన సరఫరా రంగంలో కొత్త పోటీ ప్రారంభమైంది. రవాణా సేవలతో గుర్తింపు పొందిన ప్రముఖ సంస్థ ర్యాపిడో ఇప్పుడు భోజన సరఫరా రంగంలోకి అధికారికంగా ప్రవేశించింది. 'ఓన్లీ' పేరుతో కొత్త సేవలను ప్రారంభిస్తూ బెంగళూరు నగరంలో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు మొదలుపెట్టింది. గత ఏడు నెలలుగా ఎంపిక చేసిన ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా ఈ సేవలను నిర్వహించిన అనంతరం సానుకూల ఫలితాలు రావడంతో విస్తరణకు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం భోజన సరఫరా రంగంలో ఆధిపత్యం చెలాయిస్తున్న జొమాటో, స్విగ్గీ సంస్థలకు గట్టి పోటీ ఇవ్వాలని ర్యాపిడో లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటివరకు ఈ దిగ్గజ సంస్థలు ప్రతి ఆర్డర్‌పై రెస్టారెంట్ల నుంచి 16 శాతం నుంచి 30 శాతం వరకు కమీషన్ వసూలు చేస్తున్నాయి. ఈ అధిక కమీషన్ల వల్ల చిన్న, మధ్యతరహా హోటల్ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో 'ఓన్లీ' వినూత్న ధరల విధానాన్ని అమలు చేస్తోంది. రూ. 400 కంటే తక్కువ విలువైన ఆర్డర్లకు కేవలం రూ. 25 మాత్రమే, అంతకంటే ఎక్కువ విలువ ఉన్న ఆర్డర్లకు రూ. 50 మాత్రమే సేవా రుసుముగా నిర్ణయించింది. స్థిర రుసుము విధానం అమలు చేయడం వల్ల రెస్టారెంట్లపై కమీషన్ భారం తగ్గి వారికి లాభాలు పెరిగే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ కొత్త విధానం వల్ల వినియోగదారులకు కూడా ప్రయోజనం కలగొచ్చని అంచనా వేస్తున్నారు. రెస్టారెంట్ల ఖర్చులు తగ్గితే ఆహార ధరలు కూడా కొంత మేర తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా చిన్న హోటళ్లకు ఇది ఊరటగా మారవచ్చని అంటున్నారు. బెంగళూరులో ఈ సేవలు విజయవంతమైతే త్వరలోనే ఇతర ప్రధాన నగరాలకు విస్తరించాలనే యోచనలో ర్యాపిడో ఉన్నట్లు సమాచారం. దేశంలో భోజన సరఫరా రంగంలో కొత్త పోటీ ప్రారంభమవుతున్న ఈ పరిణామం వినియోగదారులకు, వ్యాపారులకు ఎలా ఉపయోగపడుతుందో చూడాల్సి ఉంది.

# ఏప్రిల్ 1 నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో మార్పులు

దేశంలోని ప్రముఖ ప్రైవేట్ బ్యాంకులలో ఒకటైన HDFC Bank తన ఖాతాదారులకు కీలక సమాచారం వెల్లడించింది. 2026 ఏప్రిల్ 1 నుంచి యూపీఐ ద్వారా ఏటీఎంలలో నగదు ఉపసంహరణపై కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు డెబిట్ కార్డు ద్వారా తీసిన నగదుకే నెలవారీ ఉచిత పరిమితి వర్తించేది. ఇకపై యూపీఐ ఆధారంగా సంకేత చిహ్నాన్ని స్కాన్ చేసి తీసే నగదును కూడా అదే ఉచిత పరిమితిలో లెక్కించనున్నారు. సేవింగ్స్ ఖాతాదారులకు సాధారణంగా నెలకు ఐదు ఉచిత ఏటీఎం లావాదేవీలు అందుబాటులో ఉంటాయి. కొత్త నిబంధనల ప్రకారం, కార్డు ద్వారా తీసినా, మొబైల్ ఫోన్ ద్వారా యూపీఐ విధానంలో





తీసినా — ఆ ఐదు లావాదేవీలలోనే అవి చేరతాయి. పరిమితిని దాటితే ప్రతి అదనపు ఉపసంహరణకు బ్యాంకు నిర్ణయించిన రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఇతర బ్యాంకుల ఏటీఎంలను వినియోగించినప్పుడు మహానగరాల్లో మూడు సార్లు మాత్రమే ఉచితంగా నగదు తీసుకునే అవకాశం ఉంటుంది. ఆ పరిమితిని మించితే అదనపు రుసుములు వర్తిస్తాయి. ఖాతాదారులు తమ లావాదేవీలను జాగ్రత్తగా నిర్వహించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

యూపీఐ ఏటీఎం సౌకర్యం కార్డు లేకపోయినా నగదు పొందేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. ఏటీఎం తెరపై కనిపించే సంకేత చిహ్నాన్ని వంటి డిజిటల్ చెల్లింపు అనువర్తనాల ద్వారా స్కాన్ చేసి అవసరమైన మొత్తాన్ని పొందవచ్చు.

ఇటీవల ప్రకటించిన ఆర్థిక ఫలితాల ప్రకారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు లాభాలు 12.17 శాతం పెరిగాయి. సేవల నిర్వహణ వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ నుంచి అమల్లోకి రానున్న ఈ కొత్త నిబంధనలపై ముందుగానే అవగాహన పెంచుకుంటే అదనపు రుసుముల భారాన్ని తప్పించుకోవచ్చు.

# బంగారం ధర మళ్లీ పతనం

పసిడి కొనుగోలుదారులకు మరోసారి శుభవార్త అందింది. వరుసగా రెండో రోజు కూడా బంగారం ధరలు భారీగా తగ్గాయి. అంతర్జాతీయ ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ పసిడి ధరపై ఒత్తిడి నెలకొనడంతో మార్కెట్లో గణనీయమైన పడివేత నమోదైంది. రెండు రోజుల వ్యవధిలోనే తులం ధర దాదాపు ఐదు వేల రూపాయల వరకు తగ్గడం గమనార్హం. మార్చి 4న హైదరాబాద్‌లో ఇరవై రెండు ప్రమాణాల బంగారం ధర తులానికి రూ. 2,650 తగ్గి రూ. 1,54,650కు చేరింది. అంతకుముందు రోజూ రూ. 2,350 మేర తగ్గడంతో వరుసగా రెండో రోజు కూడా కొనుగోలుదారులకు ఉపశమనం లభించింది. వివాహాలు, శుభకార్యాల నేపథ్యంలో బంగారం కొనుగోలు చేయాలని భావిస్తున్నవారికి ఈ తగ్గుదల కొంత ఊరటనిచ్చింది. ఇరవై నాలుగు ప్రమాణాల బంగారం ధర కూడా భారీగా పడిపోయింది. పది గ్రాములకు రూ. 2,890 తగ్గి రూ. 1,67,620 వద్ద నమోదైంది. గత వారం వరకు స్థిరంగా ఉన్న ధరలు ఒక్కసారిగా క్షీణించడం వ్యాపార వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. పెట్టుబడిదారులు జాగ్రత్తగా వ్యవహరిస్తుండటంతో కొనుగోలు, అమ్మకాల పరిమాణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మరోవైపు వెండి ధరలో పెద్ద మార్పులు కనిపించలేదు. ప్రస్తుతం హైదరాబాద్‌లో కిలో వెండి ధర సుమారు రూ. 3.15 లక్షల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. బంగారంతో పోలిస్తే వెండి ధరలో చలనం తక్కువగా ఉండటం గమనించదగిన విషయం. అంతర్జాతీయ స్థాయిలో కూడా బంగారం ధరలు క్షీణిస్తున్నాయి. అమెరికా నాణెం విలువ బలపడడం, వడ్డీ రేట్లపై అనిశ్చితి కొనసాగడం వంటి అంశాలు పసిడి ధరపై ప్రభావం చూపుతున్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. పెట్టుబడిదారులు భద్రమైన మార్గాలవైపు మొగ్గుచూపుతుండటంతో బంగారం ఆకర్షణ కొంత తగ్గిందని విశ్లేషిస్తున్నారు. యుద్ధ పరిస్థితులు, చమురు ధరల మార్పులు, ద్రవ్యోల్బణ అంచనాలు వంటి అంశాలు కూడా పసిడి ధరలపై ప్రభావం చూపుతున్నాయి. రాబోయే రోజుల్లో అంతర్జాతీయ పరిస్థితుల ఆధారంగా బంగారం ధరల్లో మరింత మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మొత్తంగా చూస్తే, వరుస తగ్గుదలతో బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది అనుకూల సమయంగా భావించవచ్చు. అయితే ధరలు ఎటు వైపు మలుపు తిరుగుతాయన్నదిపై స్పష్టత రావాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.




# సెమీస్ వరకు దూసుకెళ్లి.. కివీస్ చేతిలో చిత్తు – మరోసారి 'ఛోకర్స్'గా దక్షిణాఫ్రికా

టీ-20 ప్రపంచకప్ తొలి అర్ధఫైనల్ పోటీలో దక్షిణాఫ్రికా జట్టు మరోసారి కీలక దశలో తడబడి 'ఛోకర్స్' ముద్రను దూరం చేసుకోలేకపోయింది. కోల్‌కతాలోని మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ జట్టు ఏకపక్షంగా విజయం సాధించి తుది పోటికి అర్హత సాధించింది.

టాస్ గెలిచిన న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ సాంట్నర్ ముందుగా బంతి విసిరే నిర్ణయం తీసుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా జట్టు నిర్ణీత ఓవర్లలో 170 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఒక దశలో ఐదు వికెట్లకు 77 పరుగులతో కష్టాల్లో పడిన ఆఫ్రికా జట్టును మార్కో జాన్సెన్ అజేయ అర్ధశతకంతో ఆదుకున్నాడు. 30 బంతుల్లో 55 పరుగులు చేసి జట్టుకు పోరాడే స్కోరు అందించాడు. అతనికి తోడుగా ట్రిస్టన్ స్టబ్స్ 29 పరుగులు చేసి ఆరో వికెట్‌కు విలువైన భాగస్వామ్యం నెలకొల్పాడు.

అయితే 170 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ జట్టు కేవలం 12.5 ఓవర్లలోనే ఛేదించడం సంచలనం సృష్టించింది. కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి గెలవడం దక్షిణాఫ్రికా బౌలింగ్ వైఫల్యాన్ని బహిర్గతం చేసింది. న్యూజిలాండ్ తరఫున ఫిన్ అలెన్ 100 పరుగులతో చెలరేగాడు. ఎనిమిది సిక్సర్లు, పది బౌండరీలతో అతడు ఆడిన ఇన్నింగ్స్ మ్యాచ్‌ను పూర్తిగా కివీస్ వైపు తిప్పింది. అతనికి తోడుగా టిమ్ సీఫెర్ట్ 58 పరుగులు చేసి జట్టుకు బలమైన ఆరంభం ఇచ్చాడు.

దక్షిణాఫ్రికా బౌలర్లలో కగిసో రబడా ఒక్క వికెట్ సాధించగా, మిగిలినవారు పూర్తిగా నిరాశపరిచారు. న్యూజిలాండ్ బౌలర్లలో మాట్ హెన్రీ, రచిన్ రవీంద్ర తలా రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేశారు.

సెమీఫైనల్ వరకు ఓటమి లేకుండా దూసుకొచ్చిన దక్షిణాఫ్రికా జట్టు కీలక దశలో విఫలమవడం అభిమానులను నిరాశపరిచింది. మరోవైపు, అద్భుత ప్రదర్శనతో న్యూజిలాండ్ జట్టు ఫైనల్‌కు చేరుకుని కప్ దిశగా బలమైన అడుగు వేసింది. మొత్తంగా ఈ మ్యాచ్ దక్షిణాఫ్రికా జట్టుకు మరో చేదు జ్ఞాపకంగా మిగిలిపోగా, న్యూజిలాండ్‌కు చారిత్రాత్మక విజయంగా నిలిచింది.

## భారత్-ఇంగ్లాండ్ సెమీఫైనల్ సమరం..

# పాత లెక్కల తీర్పు







ప్రపంచకప్ పోటీల్లో అత్యంత ఆసక్తికరమైన అర్ధఫైనల్ సమరం రేపు ముంబైలోని వాంఖడే స్టేడియం మైదానంలో జరగనుంది. ప్రస్తుత విజేతగా ఉన్న భారత జట్టు, రెండుసార్లు కప్ గెలిచిన ఇంగ్లాండ్ జట్టుతో తలపడనుంది. రెండు బలమైన జట్లు ముఖాముఖి కావడంతో ఈ పోరుపై దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ప్రపంచకప్ అర్ధఫైనల్‌లో ఈ రెండు జట్లు వరుసగా మూడోసారి ఎదురెదురుగా నిలవడం ప్రత్యేకతగా మారింది. గత రెండు సందర్భాల్లో ఈ జట్ల మధ్య జరిగిన అర్ధఫైనల్ పోటీలో గెలిచిన జట్టే చివరకు కప్‌ను సొంతం చేసుకోవడం గమనార్హం. దీంతో రేపటి పోరు కేవలం ఫైనల్‌కు చేరుకునే అవకాశమే కాకుండా, గత ఫలితాలపై తుది తీర్పుగా మారనుంది.

రెండు వేల ఇరవై రెండు సంవత్సరంలో జరిగిన అర్ధఫైనల్ భారత అభిమానులకు చేదు జ్ఞాపకంగా మిగిలింది. ఆ పోటీలో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ మంచి పరుగులు సాధించినప్పటికీ, ఇంగ్లాండ్ ఓపెనర్లు వికెట్ కోల్పోకుండా లక్ష్యాన్ని ఛేదించి పది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఆ ఓటమి భారత అభిమానులను తీవ్ర నిరాశకు గురిచేసింది.

అయితే రెండు వేల ఇరవై నాలుగు ప్రపంచకప్‌లో భారత్ ఆ పరాజయానికి ప్రతీకారం తీర్చుకుంది. ఆ పోటీలో భారత్ ముందుగా భారీ స్కోరు నమోదు చేసింది. అనంతరం బంతి విసిరే విభాగం అద్భుతంగా రాణించి ఇంగ్లాండ్ జట్టును తక్కువ పరుగులకే కట్టడి చేసింది. ఆ విజయంతో భారత్ తుది పోటికి చేరి చివరకు కప్‌ను కూడా కైవసం చేసుకుంది. ఇప్పుడు ఇరు జట్లు ఒకటికి ఒకటి సమానంగా నిలిచాయి. రేపు జరగనున్న అర్ధఫైనల్ పోటీలో గెలిచి తుది సమరానికి చేరుకోవాలని రెండు జట్లు పట్టుదలగా ఉన్నాయి. అభిమానులు ఈ కీలక పోరును ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. క్రీడాభిమానులందరి దృష్టి ఇప్పుడు ముంబై మైదానంపైనే నిలిచింది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




## ఉగాదికి 'ఉస్తాద్' రాక..?

# బాక్సాఫీస్ బద్దలే ఇక

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నుంచి గత ఏడాది వచ్చిన "ఓజి" తర్వాత అభిమానులు అంతా నెక్స్ట్ రానున్న ఉస్తాద్ భగత్ సింగ్ కోసమే ఎదురు చూస్తున్నారు. ఇది మొత్తం మాస్ ఎంటర్టైనర్ కావడంతో అభిమానులతో పాటుగా రెగ్యులర్ ఆడియెన్స్ లో కూడా మంచి బజ్ ఉంది. ఇక ఈ సినిమా రిలీజ్ పరంగా ఇప్పుడు ఊహించని రీతిలో సమీకరణాలు మారుతున్నట్టు తెలుస్తుంది.

మేకర్స్ నిజానికి ఈ సినిమాని మార్చ్ 26కి లాక్ చేశారు. కానీ ఇప్పుడు మరో వారం ముందే వచ్చేస్తుంది అన్నట్టు కొత్త టాక్ మొదలైంది. మార్చ్ 19 ఉగాది రేస్ లో మన తెలుగు స్టేట్స్ లో టాక్సిక్, దురంధర్ 2 సినిమాలు ఉన్నాయి. అయితే ఈ చిత్రాల్లో ఆల్రెడీ టాక్సిక్ వాయిదా పడింది. అలాగే ధురంధర్ 2 కూడా కొంచెం అటు ఇటుగా అంటున్నారు.

సో ఉస్తాద్ రాక మాత్రం ఈ ఉగాదికే ఉండొచ్చు అని ఆల్రెడీ సినీ వర్గాల్లో చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో పంపిణీదారులకి కూడా సమాచారం ఇచ్చినట్టు టాక్. సో ఉస్తాద్ భగత్ సింగ్ పై అధికారిక అనౌన్సమెంట్ ఒక్కటి రావాల్సి ఉంది. ఇదే నిజమై ఉగాది రేస్ లో వస్తే మాత్రం పోటీ లేకపోవడంతో ఉస్తాద్ భగత్ సింగ్ కి బాక్సాఫీస్ దగ్గర భారీ ఓపెనింగ్స్ గ్యారెంటీ అని చెప్పొచ్చు.



## విజయ్, సంగీత విడాకులు..

# 250 కోట్లతో ముడి?


ఇళయ దళపతి విజయ్ ఇప్పుడు తన సినిమా కెరీర్ ని ముగించుకున్న సంగతి తెలిసిందే. తన ఆఖరి చిత్రం జన నాయకుడు రిలీజ్ కి ఇంకా నోచుకోలేదు కానీ ఈ గ్యాప్ లో మాత్రం విజయ్ కి ఊహించని సమస్యలు కూడా వచ్చాయి. అలా తన భార్య సంగీత విజయ్ తో విడాకులు కావాలని కోరుతూ కోర్టు మెట్లు ఎక్కడం షాకింగ్ గా మారింది. అయితే ఈ సమస్యపై మరో షాకింగ్ రూమర్ ఇప్పుడు సినీ వర్గాల్లో వైరల్ గా మారింది.

తమ సమస్యని విజయ్ పబ్లిక్ గా పెట్టకుండా సామరస్యంగా ముగించాలని చూస్తున్నట్టుగా పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. విజయ్ అందుకు గాను తన భార్య, పిల్లలు జేసన్ సంజయ్, సాషాల భవిష్యత్తు ఆర్థిక నిలకడ కోసం భారీ మొత్తంలో 250 కోట్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలుస్తుంది. ఇలా తమ సమస్యని సెటిల్ చేసుకోవాలని విజయ్ భావిస్తున్నట్టు కొన్ని కొత్త రూమర్స్ ఇప్పుడు మొదలయ్యాయి. మరి దీనిపై అధికారిక క్లారిటీ బయటకి రావాల్సి ఉంది. ఇక విజయ్ మరోపక్క తన రాజకీయాల్లో బిజీగా సాగుతూ ఈ ఏడాది తమిళనాట జరగనున్న ఎన్నికలపై దృష్టి సారించారు. కానీ తన ఆఖరి సినిమా మాత్రం ఎప్పుడు రిలీజ్ అవుతుంది అనేది ఇప్పటికీ మిస్టరీ గానే ఉండిపోయింది.

## కొత్త కోడలు వచ్చింది.. మంచిగా చూసుకోండి: విజయ్ దేవరకొండ



టాలీవుడ్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన జంటగా పేరుగాంచిన విజయ్ దేవరకొండ - రష్మిక మందన్న వివాహ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. సినీ పరిశ్రమతో పాటు అభిమాన వర్గాల్లోనూ ఈ వివాహం ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది. బుధవారం సాయంత్రం జరగనున్న ఘన రిసెప్షన్‌కు ముందు ఈ నూతన దంపతులు తెలుగు మీడియా ప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలుసుకుని తమ ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ తనదైన సరదా శైలిలో మాట్లాడుతూ, "తెలుగు రాష్ట్రాలకు కొత్త కోడలు వచ్చింది.. ఆమెను అందరూ మంచిగా చూసుకోవాలి" అంటూ హాస్యంతో కూడిన వ్యాఖ్యలు చేశారు. అక్కడున్నవారంతా చప్పట్లతో అభినందనలు తెలపగా, వాతావరణం ఆనందంతో నిండిపోయింది. తమ సినీ ప్రయాణంలో మీడియా ఎంతో ముఖ్యమైన భాగమని, మొదటి రోజుల నుంచే తమకు అండగా నిలిచిందని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు జంటగా మీడియా ముందుకు రావడం జీవితంలో ఒక ప్రత్యేక క్షణమని భావోద్వేగంగా తెలిపారు. కాలం మారినా, విజయాలు పెరిగినా తమను ప్రేమించిన ప్రేక్షకులను ఎప్పటికీ మర్చిపోమని విజయ్ పేర్కొన్నారు. అభిమానుల ఆశీస్సులే తమకు అతిపెద్ద బలం అని, జీవితంలో ఈ కొత్త ప్రయాణం కూడా అందరి ఆశీర్వాదాలతో సాఫీగా సాగాలని కోరుకున్నారు. వివాహం అనేది ఇద్దరి మనసుల కలయిక మాత్రమే కాదు, రెండు కుటుంబాల అనుబంధమని ఆయన అన్నారు. రష్మిక మందన్న కూడా ఈ సందర్భంగా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైనందుకు సంతోషంగా ఉందని, ప్రేక్షకులు, అభిమానులు ఎప్పటిలాగే తమకు అండగా ఉండాలని కోరుకున్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితుల మధ్య జరిగిన వివాహ వేడుకలు ఎంతో హృదయానికి హత్తుకునేలా జరిగాయని ఆమె తెలిపారు. కొత్త కుటుంబంలో అందరూ ఎంతో ప్రేమతో ఆత్మీయంగా స్వాగతించారని పేర్కొన్నారు. ఇక నేడు సాయంత్రం జరగనున్న రిసెప్షన్‌కు సినీ, రాజకీయ, వ్యాపార రంగాల ప్రముఖులు భారీగా తరలిరానున్నారు. పలువురు అగ్రనటులు, దర్శకులు, నిర్మాతలు హాజరుకానున్నట్లు సమాచారం. ప్రముఖుల రాక నేపథ్యంలో వేడుక ప్రాంగణంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో ఇప్పటికే ఈ జంటకు శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతోంది. అభిమానులు ప్రత్యేక చిత్రాలు, సందేశాలతో తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. విజయ్ - రష్మిక జంట కొత్త జీవితాన్ని ప్రారంభించిన ఈ సందర్భం సినీ ప్రపంచంలో మరో మధుర ఘట్టంగా నిలిచిపోనుంది.




## బాలయ్య కోసం పదేళ్ల తర్వాత వస్తున్న హీరో.. సెట్ అయితే కేక..!

నందమూరి బాలకృష్ణ మరియు దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో రాబోతున్న క్రేజీ ప్రాజెక్ట్ NBK111 మార్చి 5 నుంచి హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రీప్రొడక్షన్ పనులన్నీ పూర్తి చేసిన దర్శకుడు గోపీచంద్, బాలయ్యను మరోసారి పవర్‌ఫుల్ మాస్ రోల్‌లో చూపించేందుకు సిద్ధమయ్యాడు. రామ్ చరణ్ 'పెద్ది' చిత్ర నిర్మాత వెంకట సతీష్ కిలారు ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను నిర్మిస్తున్నారు.

ఈ సినిమాలో ఒక కీలక పాత్ర కోసం మంచు మనోజ్‌ను సంప్రదించినట్లు వస్తున్న వార్తలు ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో 'ఊ కొడతారా ఉలిక్కిపడతారా' చిత్రంలో బాలయ్యతో కలిసి నటించిన మనోజ్, ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇస్తే పదేళ్ల తర్వాత వీరిద్దరి కాంబినేషన్ మళ్లీ వెండితెరపై రిపీట్ అవుతుంది. బాలయ్యతో ఉన్న సాన్నిహిత్యం నేపథ్యంలో మనోజ్ ఈ ఆఫర్‌కు ఓకే చెప్పే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తుండగా, ఎస్.ఎస్. థమన్ సంగీతాన్ని అందిస్తున్నాడు. చిత్ర యూనిట్ ఈ సినిమా షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేసి, రాబోయే దసరా కానుకగా విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## క్రేజీ కళ్యాణం.. 'సూపర్ మ్యాన్' బాలరాజుగా తరుణ్ భాస్కర్




ఒకవైపు దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటూనే, మరోవైపు నటుడిగా వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్న యువ దర్శకుడు తరుణ్ భాస్కర్ ఇప్పుడు 'క్రేజీ కళ్యాణం' చిత్రంతో సందడి చేయడానికి సిద్ధమవుతున్నాడు. హోలీ పండుగను పురస్కరించుకుని ఈ చిత్రం నుంచి ఆయన ఫస్ట్ లుక్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో తరుణ్ భాస్కర్ 'సూపర్ మ్యాన్' వేషధారణలో కనిపిస్తూ వినోదాన్ని పంచుతున్నాడు. సినిమాలో ఆయన పోషిస్తున్న 'బాలరాజు' పాత్ర హాస్యభరితంగా, ఉత్సాహంగా ఉండబోతుందనే సంకేతాలు ఈ పోస్టర్ ద్వారా స్పష్టమవుతున్నాయి. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో తరుణ్ భాస్కర్ ప్రత్యేక మేనరిజమ్స్, సంభాషణల శైలి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. యారో సినిమాస్ పతాకంపై బూసం జగన్ మోహన్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల ఈ వినోదభరిత కుటుంబ కథను తెరకెక్కిస్తున్నారు. పెళ్లి నేపథ్యంలో సాగే పూర్తి స్థాయి హాస్య, కుటుంబ వినోద చిత్రంగా ఇది రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తుండగా, నరేష్ వీకే, అఖిల్ రాజ్ ఉద్దెమారి, చైతన్య రావు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని సురేష్ బొబ్బిలి అందిస్తుండగా, ఛాయాగ్రహణాన్ని శ్యామ్ దూపాటి నిర్వహిస్తున్నారు. ఎడిటింగ్ బాధ్యతలను శ్రవణ్ కటికనేని చేపట్టారు. ఇప్పటికే తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో నిమగ్నమైంది. తరుణ్ భాస్కర్ హాస్య శైలి, అనుపమ పరమేశ్వరన్ అందం కలిసి ఈ చిత్రంపై సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొల్పాయి. కుటుంబ సమేతంగా నవ్వులు పూయించే వినోదాన్ని అందించాలనే లక్ష్యంతో రూపొందుతున్న 'క్రేజీ కళ్యాణం' విడుదలకు ముందే ఆసక్తిని రేకెత్తిస్తోంది.

# బహిరంగ వేదికల్లో అనుచిత చిత్రీకరణపై గళమెత్తిన కన్నడ నటీమణులు



సినిమా ప్రచార కార్యక్రమాలు, గీతాల ఆవిష్కరణ వేడుకలు, పురస్కార కార్యక్రమాలు వంటి బహిరంగ వేదికల్లో హీరోయిన్ల వస్త్రధారణపై చర్చలు జరగడం కొత్త విషయం కాదు. అయితే ఇటీవల కొంతమంది చిత్రకారులు, అంతర్జాల వేదికల ప్రతినిధులు మహిళా నటీమణులను అనుచిత కోణాల్లో చిత్రీకరిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీశాయి. అవసరం లేకపోయినా కెమెరాలను దగ్గరగా తీసుకెళ్లి శరీర భాగాలపై కేంద్రీకరించడం, ఆ దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పంచడం వంటి ధోరణులు పెరుగుతున్నాయని సినీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఈ పరిస్థితుల నేపథ్యంలో కన్నడ చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు నటీమణులు బహిరంగంగా స్పందించారు. ముఖ్యంగా సప్తమి గౌడ ఈ అంశంపై స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. కాంతార చిత్రంతో విస్తృత గుర్తింపు పొందిన ఆమె, తన సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా మహిళా కళాకారులను కళాకారులుగానే చూడాలని విజ్ఞప్తి చేశారు. ఉద్దేశపూర్వకంగా కెమెరాలను జూమ్ చేసి అవమానకర కోణాల్లో చిత్రీకరించడం పూర్తిగా అనైతికమని ఆమె పేర్కొన్నారు. "మేము మా పనికోసం వేదికపైకి వస్తాం. అనవసరంగా దగ్గరగా చిత్రీకరించడం మా గౌరవాన్ని దెబ్బతీయడమే" అంటూ ఆమె భావోద్వేగంతో స్పందించారు. కళాకారిణుల ప్రతిభ, కృషి కంటే వారి దుస్తులు లేదా శరీరాకృతులపై దృష్టి పెట్టడం సమంజసం కాదని ఆమె అభిప్రాయపడ్డారు. మహిళలను వస్తువులుగా చూపించే ధోరణి మారాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు.

సప్తమి గౌడ అభిప్రాయానికి రుక్మిణి వసంత్, ఆషిక రంగనాథ్ మద్దతు తెలిపారు. బహిరంగ కార్యక్రమాల్లో మహిళా నటుల ఫోటోలు, దృశ్యాలను అసభ్యకర కోణాల్లో చిత్రీకరించడం అసహ్యకరమని, ఇది పూర్తిగా ఆమోదయోగ్యం కాదని వారు స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధులు, డిజిటల్ వేదికల నిర్వాహకులు కళాకారిణుల వ్యక్తిగత గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగి ఉన్నారని గుర్తుచేశారు.

సామాజిక మాధ్యమాల విస్తరణతో సినీతారలకు అభిమానుల మద్దతు పెరిగినప్పటికీ, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే ధోరణులు పెరగడం ఆందోళనకరమని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. కళను గౌరవించే వాతావరణం ఏర్పడాలంటే చిత్రీకరణలో నైతిక ప్రమాణాలు పాటించాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు.

మహిళా కళాకారిణులను గౌరవంతో చూడాలని కోరుతూ ప్రారంభమైన ఈ స్వరానికి కన్నడ చిత్రసీమలోని పలువురు నటీనటులు మద్దతుగా నిలవడం విశేషం. బహిరంగ వేదికల్లో గౌరవప్రదమైన సంస్కృతి నెలకొల్పాల్సిన అవసరం ఉందన్న సందేశం ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రధాన చర్చగా మారింది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in